ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సెప్టెంబర్ 2009

వెల : రూ. 10

విద్యావన్తం యశస్వన్తం
లక్ష్మీవన్తఞ్చ మాం కురు।

సుబోధ

స్త్రీలందరూ జగన్మాత అంశలే కాబట్టి వారిని తల్లుల లాగ భావించాలి. స్త్రీలు యోగ్యులైనా, అయోగ్యులైనా, పతివ్రతలైనా, కాకపోయినాసరే వారిని ఆనందమయి అయిన ఆ జగజ్జనని దివ్య స్వరూపాలుగా చూడాలి.

తంత్ర శాస్త్రానుసారం మూడు విధాలైన సాధనలున్నాయి. జగజ్జనని పట్ల సాధకుడు వీరభావాన్ని కానీ, సఖీభావాన్ని కానీ, మాతృభావాన్ని కానీ అవలంబించవచ్చు. నాది మాతృభావ సాధన. సాధకుడు జగన్మాత సఖినని భావించడం కూడా మంచిదే కానీ, వీరభావం, లేక వీరాచారం అపాయంతో కూడుకొని ఉంది. జగన్మాతను మాతృమూర్తిగా భావించే మాతృభావవే నిష్కళంకమైనది.

నీకు దైవానుగ్రహం కావాలంటే పరాశక్తి అయిన జగన్మాతను సంతుష్టురాలిని చేసుకో. ఔను! ఆమె మహామాయ. సమస్త జగత్తునూ భ్రమింపచేసేది ఆమే. సృష్టి, స్థితి, లయ అనే మహాలీలను ఆమె సాగిస్తోంది. సర్వాన్నీ ఆమె అజ్ఞానంతో కప్పింది. ఆమె మోక్షద్వారాన్ని తెరవనిదే ఎవరూ ఆత్మసౌధంలోకి ప్రవేశించలేరు. బయట నుంచి మనం కేవలం బాహ్య విషయాలను చూస్తున్నాం. సచ్చిదానందమయుడి స్వరూపం సర్వదా మనకు అతీతమై, అగోచరమై ఉంది.

దివ్యశక్తి విద్య, అవిద్య అనే రెండురూపాలలో వెలుస్తోంది. కామినీ కాంచనాలచే అవిద్య జగత్తును భ్రమింపజేస్తూ సంసారబద్ధం కావిస్తోంది. విద్య- భక్తికీ, జ్ఞానానికీ, ప్రేమకీ, కారుణ్యానికీ నిలయమై మనల్ని పరమేశ్వరుని సన్నిధికి కొనిపోతుంది. ❖

('శ్రీరామకృష్ణ బోధామృతం' నుంచి)

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029
ఫోన్: 040-2766 7799, 2763 3936
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

సురభి

"ఆ సాయం సమయం మరచిపోలేనిది. మాతృదేవి ఒక బల్ల మీద కూర్చొని ఉన్నారు. నేను (స్వామి హరిప్రేమానంద) మాతృదేవి పాదాల మ్రోల కూర్చొని, పాదపద్మాలను ఒత్తుతున్నాను. ఆ పాదాలు ముడతలతో బాగా శుష్కించిపోయాయి. అమ్మ పాదాలను చూడగానే నా మనస్సులో, "మాతృదేవి నిజంగా జగన్మాతేనా? దేవి పాదాలు ఇంత కళావిహీనంగా, నరాలు కనబడేలా శుష్కించి ఉంటాయా?" అనే సందేహం కలిగింది. కానీ బయటకు వ్యక్తం చేయలేదు. పాదపద్మాలను ఒత్తుతూనే ఉన్నాను.

అప్పుడు మెల్లమెల్లగా దృశ్యంలో మార్పు వచ్చింది. ఆ పాదాలు ఒక వృద్ధురాలి శుష్కించిన పాదాలలా కాకుండా ఒక యువతి పాదాలలా గోచరించాయి. అందమైన పాదాలు, వాటిపై పారాణి, అర్ధచంద్రుల లాంటి గోళ్ళు – ఇవన్నీ ప్రక్కనే ఉన్న దీపం వెలుతురులో స్పష్టంగా కనబడ్డాయి. ఆ పాదాలకు బంగారు గొలుసులు, వజ్ర వైడూర్యాలు పొదిగిన నూపురం ప్రకాశించాయి. ఈ పాదాలెవరివి? నేను ఎవరి పాదాలను ఒత్తుతున్నానని దిగ్భ్రమ చెందాను.

కళ్ళను ఒకసారి నులుముకొని చూశాను. బంగారు కాంతులతో మెరిసిపోతూ జగద్ధాత్రీదేవి ఆసీనురాలై ఉంది. మూడు నేత్రాలు, ఆయుధాలు ధరించిన నాలుగు చేతులు, అనేక ఆభరణాలు, వజ్రవైడూర్యాలు పొదిగిన ఆ కిరీటం నుంచి ఉత్పన్నమైన ప్రకాశం నాలుగు దిశలనూ నింపివేస్తూ ఉంది. నేను భావోద్వేగంతో, 'అమ్మా', అమ్మా' అంటూనే బాహ్యస్మృతిని కోల్పోయాను.

ఎంతసేపు ఆ స్థితిలో ఉన్నానో నాకు తెలియదు. మళ్ళీ బాహ్యస్మృతి కలిగేటప్పటికి మాతృదేవి నా వీపు నిమురుతూ, 'హరీ, ఓ హరీ! నీకేమైంది? లే, లే' అంటున్నారు. అప్పుడు నాకు బాహ్యస్మృతి కలిగింది. ❖

(స్వామి హరిప్రేమానంద స్మృతుల నుంచి)

With Best Compliments From

CHAIRMAN & MANAGING DIRECTOR

THE KCP LIMITED

KCP కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 66 సంచిక: 9 సెప్టెంబర్ 2009

సర్వస్య బుద్ధిరూపేణ జనస్య హృది సంస్థితే ।
స్వర్గాపవర్గదే దేవి నారాయణి నమోఽస్తుతే ॥

సర్వజనుల హృదయాలయందు బుద్ధిరూపంలో ఉన్న ఓ దేవీ! స్వర్గసుఖాల్నీ, మోక్షాన్నీ ప్రసాదించే ఓ నారాయణీ! నీకు ప్రణామములు.

('దేవీ మాహాత్మ్యం 11-8)

లోపలి పేజీల్లో...

4 సంపాదకీయం
ఆధ్యాత్మిక యాత్రకు అనువైన బాట

11 దేవీ వైభవం

6 గోరుముద్ద
కార్య సాఫల్యత

13 ధీరవాణి
నిస్వార్థ ప్రేమకు ప్రతీక!

7 పరమపద ప్రాప్తికి భగవన్నామ జపం

15 ఆచారవ్యవహారాలు-అంతరార్థాలు
ఆరోగ్యం అందించే శంఖం

8 మహాపురుషుల్లోని మహోన్నత లక్షణం !

16 బొమ్మల కథ
నిరుపేదల సేవలో తరించిన తరుణి

9 పరమేశ్వరుని పరిరక్షణలో...
దివాన్‌జీ నేర్చుకున్న పాఠం

18 కుమారీ పూజ ప్రాముఖ్యం



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'లో సభ్యులుగా చేరి ధనదానం చేయాల్సిందిగా మనవి. సభ్యుల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............ రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................. రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

దాతపేరు	చిరునామా	రూ.
మహారాజ పోషకులు	: శ్రీ పరమహంస పరివ్రాజక ఈశ్వరానంద భారతి స్వామి (శిష్యురాలు ఓ.కృష్ణవేణి), హైదరాబాద్	10,000
" "	: శ్రీమతి ఎమ్. లీలావతి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లా (కీ॥శే॥ అనంత లక్ష్మమ్మ జ్ఞాపకార్థం)	10,000
రాజ పోషకులు	: శ్రీ సి. గిరిరాజ్ కృష్ణ, C/o వి.ఐ.హెచ్.ఇ., రామకృష్ణ మఠం, హైదరాబాద్ (కీ॥శే॥ సి.జి. శ్రీనివాస్ జ్ఞాపకార్థం)	5,000
పోషకులు	: శ్రీమతి నామాల శ్యామల, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ (కీ॥శే॥ కాండ్రేగుల విఘ్నేశ్వరరావు జ్ఞాపకార్థం)	2,200
" "	: శ్రీ కె. గురప్ప, టెలికామ్ నగర్, బి-క్యాంప్ (పి.ఓ.), కర్నూలు - 518 002	1,050
" "	: నందిగాం లక్ష్మీనరసింహారావు, గాంధీనగర్, హైదరాబాద్ (కీ॥శే॥ నందిగాం సీతారామయ్య జ్ఞాపకార్థం)	1,000
" "	: ఒక శ్రేయోభిలాషి, కళ్యాణ్‌దుర్గం, అనంతపురం (కీ॥శే॥ కాసుల వీరభద్రప్ప జ్ఞాపకార్థం)	1,000

With Best Compliments From

Sri K.S.N.SARMA(in memory of his wife Smt.KAPAVARAPU JANAKI DEVI)

H.No.5-43/15/71, P.S. Rao Nagar, Dammaiguda, Hyderabad - 500 083

'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను మెదక్, కృష్ణా జిల్లాలలోని 1000 పాఠశాలలకు ఒక సంవత్సరానికీ, మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లోని 107 కళాశాలలకు మూడు సంవత్సరాలకూ స్పాన్సర్ చేశారు.

With Best Compliments From : **SRI M. SATYANARAYANA RAJU, Managing Director**

SRK INFRA PROJECTS (P) LTD.,

Plot.No. : 35, Pandurangapuram, Visakhapatnam - 530 003

'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రిక 500 ప్రతులను ఆంధ్రప్రదేశ్‌లోని కారాగారాలకు ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.

ముఖచిత్రం : దారిద్ర్యాన్ని పటాపంచలు చేసే బంగారు తల్లి శ్రీదేవీ, ముగ్గురమ్మలకూ మూలమైన దుర్గాదేవీ, వికాస ప్రకాశాలకు ప్రతీకైన స్వచ్ఛ ధవళ సుందర మూర్తి సరస్వతీదేవీ.

ADVERTISEMENT TARIFF

	MULTI COLOUR	B & W
Fourth Cover	Rs.25,000	-
Second Cover	Rs.20,000	-
Third Cover	Rs.20,000	-
Inside Full Page	Rs.15,000	10,000
Inside Half Page	Rs.10,000	5,000

చందా వివరాలు	ఇండియాలో	విదేశాలలో
విడి ప్రతి :	రూ. 10	-
ఒక సంవత్సర చందా :	రూ. 100	$ 25
మూడు సంవత్సరాలకు :	రూ. 280	$ 55
ఐదు సంవత్సరాలకు :	రూ. 450	$ 85
ఇరవై సంవత్సరాలకు :	రూ. 1500	$ 365

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో **Ramakrishna Math, Hyderabad** అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా : **Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.**

లోపలి పేజీల్లో...

20 ఓ మహాత్యాగి ఆత్మకథ
(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

28 అసలైన శరణాగతి

22 ఉపాధ్యాయ వృత్తి – మానవతా విలువలు

29 ముందుకు సాగిపో!

24 ప్రాచీన గాథలు: జీవన వికాసం
ఒదిగిన కొద్దీ ఎదుగుదల!

33 నా జీవితంలో స్వామి వివేకానంద
మఠం సందర్శనతో మార్పు

26 యువవాణి
నవతరం సందేహాలకు సమాధానాలు

34 మహనీయుల జీవితాల్లో మధురఘట్టాలు
ఆచార్యదేవోభవ!

27 విజయం నీ చేతిలోనే ఉంది

35 మా తల్లి గాజులకు నీరాజనం...
నిత్య నీరాజనం...

దసరా శుభాకాంక్షలు

'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు, రచయితలకు, రచయిత్రులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, దాతలకు మా హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు. –సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు పైన చిరునామాకు కుడి భాగంలో మీ చందా గడువు ముగిసే నెల వ్రాసి ఉంది. సకాలంలో సొమ్ము చెల్లించి, చందా పొడిగించుకోండి. 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆధ్యాత్మిక వెలుగులు మీ ఇంట నిరంతరాయంగా ప్రసరించేలా సహకరించండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నెంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- పత్రిక ప్రతీ నెల 26వ తేదీన పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపు చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

- సర్క్యులేషన్ మేనేజర్

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు.
– సంపాదకులు

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
Domalguda, Hyderabad - 500 029. Andhra Pradesh
Phone No: 040 - 2766 7799, E-mail : sriramakrishnaprabha@gmail.com

ఆధ్యాత్మిక యాత్రకు అనువైన బాట

'ఎన్నో ఏళ్ళుగా జపధ్యాన సాధనలు చేస్తున్నాం. కానీ ఇంత వరకూ భగవద్దర్శనం లభించలేదు' అని సందేహం వ్యక్తపరుస్తూ ఉంటాం.

మనందరికీ వచ్చే సందేహమే కేశవచంద్రసేన్‌కు కూడా వచ్చింది. ఒకసారి కేశవచంద్రసేన్, "నేను భగవంతుణ్ణి ఎందుకు దర్శించలేక పోతున్నాను" అని శ్రీరామకృష్ణుల్ని ప్రశ్నించాడు. "నువ్వు సిరిసంపదలతోనూ, పేరు ప్రతిష్ఠలతోనూ సంతృప్తిగా ఉన్నంతవరకూ భగవంతుణ్ణి దర్శించలేవు. పిల్లవాడు బొమ్మలతో ఆనందంగా ఆడుకొంటున్నంతసేపూ తల్లి, పిల్లవాణ్ణి గురించి పట్టించుకోదు. ఎప్పుడైతే పసివాడు బొమ్మలాటతో విసిగిపోయి, అమ్మ కోసం విలపిస్తాడో అప్పుడు మాత్రమే తల్లి పరుగున వచ్చి పిల్లవాణ్ణి అక్కున చేర్చుకుంటుంది"అని శ్రీరామకృష్ణులు సమాధానమిచ్చారు.

భగవంతుడు తల్లి లాంటివాడు. మనం మనఃస్ఫూర్తిగా ఏం కావాలనుకుంటున్నామో, భగవంతుడు అదే మనకు ప్రసాదిస్తాడు. పిల్లవాడు తనకు 'ఆటబొమ్మలు' కావాలని తల్లిని అడిగితే, ఆటబొమ్మల్నే ఇస్తుంది. 'అమ్మే' కావాలని ఆరాటపడితే, అమ్మే స్వయంగా వస్తుంది. మనం కూడా భగవంతుణ్ణి ప్రాపంచిక విషయవస్తువులనే ఆటబొమ్మలను కోరితే, వాటినే ప్రసాదిస్తాడు. 'నువ్వు' తప్ప వేరేమీ అక్కరలేదు అని ప్రార్థిస్తే, ఆయనే దర్శనమిస్తాడు.

ఆవేదనే అసలైన అర్హత: భగవంతుణ్ణి దర్శించడానికి ముఖ్యంగా కావలసిన అర్హత 'ఆవేదన'. ఆవేదన ఉంటే ఆయనను దర్శించడం అసంభవమేమీ కాదు. అందుకు నిదర్శనం శ్రీరామకృష్ణుల జీవితం.

జగజ్జనని కాళీమాత దర్శనం కోసం శ్రీరామకృష్ణులు ఏ సాధనలు చేశారు? ఆయన చేసిన సాధనంతా ఒకే ఒక్కటి – 'ఆక్రందన'. నాకు అమ్మ తప్ప వేరేదీ వద్దని అమ్మ కోసం విలపించారు. ఆవేదనతో కూడిన ఆక్రందన వల్లనే అమ్మను దర్శించగలిగారు ఆయన. కాబట్టి 'తల్లి కోసం తల్లడిల్లే పసిహృదయం' ఉంటే భగవంతుణ్ణి దర్శించడం సాధ్యమని శ్రీరామకృష్ణులు అనుభవపూర్వకంగా నిరూపించారు.

సర్వావస్థల్లోనూ ఆ సర్వేశ్వరే ఆధారం: కష్ట సుఖాల్లోనూ, నిందాస్తుతుల్లోనూ సమచిత్తం కలిగి ఉండాలంటే భగవంతుని పట్ల సంపూర్ణ శరణాగతి భావం ఉంటేనే అది సాధ్యమవుతుంది.

అవమానం కలిగినా, అభిమానం పొందినా – ఈ రెండు సందర్భాల్లోనూ శ్రీరామకృష్ణులు ఎలా స్పందించారో తెలుసుకుందాం:

శ్రీరామకృష్ణులకు నరేంద్రుడంటే (స్వామి వివేకానంద) ఎంతో ప్రేమ. నరేంద్రుణ్ణి ఒక్కరోజైనా చూడకుండా ఉండలేక పోయేవారు ఆయన. ఒక వారం రోజుల పాటు నరేంద్రుడు, శ్రీరామకృష్ణులను దర్శించడానికి వెళ్ళలేదు. అప్పుడు ఆయనే స్వయంగా నరేంద్రుణ్ణి చూడడానికి వెళ్ళారు. తనపై శ్రీరామకృష్ణులకు ఉన్న మమకారాన్ని చూసి నరేంద్రుడు అందరి ముందూ పరుషంగా, 'జడభరతుడు సదా లేడిపిల్ల గురించే చింతిస్తూ ఉండడం వల్ల మరుసటి జన్మలో లేడిగా జన్మించాడు. మీరు కూడా నిరంతరం నా గురించే చింతిస్తే మీరు ఏమవుతారో ఆలోచించండి' అని శ్రీరామకృష్ణులను నిందించాడు.

చిన్నపిల్లల్ని ఎవరైనా మందలిస్తే ఏడుస్తూ తల్లి దగ్గరకు వెళతారు. అలాగే శ్రీరామకృష్ణులు కూడా కాళీమాత ఆలయానికి వెళ్ళి, జరిగిన విషయాన్ని జగజ్జననితో విన్నవించుకున్నారు. అప్పుడు జగన్మాత, 'నువ్వు నరేంద్రునిలో ఆ నారాయణుణ్ణి దర్శిస్తున్నావు. కాబట్టే అతడంటే నీకు అంత ప్రేమ. నువ్వు ఎప్పుడైతే నరేంద్రునిలో నారాయణుణ్ణి దర్శించలేవో అప్పుడు అతని ముఖం ఒక్క క్షణం కూడా చూడలేవు' అని శ్రీరామకృష్ణులను ఓదార్చింది.

అద్వైత సాధనలో ఆరితేరిన బ్రహ్మజ్ఞాని తోతాపురి (శ్రీరామకృష్ణుల వేదాంతాచార్యుడు) దక్షిణేశ్వరానికి వచ్చాడు. అతడు శ్రీరామకృష్ణుణ్ణి చూసిన వెంటనే 'ఇతడే అద్వైత సాధనకు

సరైన యోగ్యుడు' అని భావించాడు. వెంటనే తోతాపురి శ్రీరామకృష్ణుల దగ్గరకు వెళ్ళి 'నువ్వు వేదాంత సాధనలను అభ్యసిస్తావా?' అని అడిగాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు 'ఏం చేయాలో, ఏం చేయరాదో నాకేమీ తెలియదు. అంతా మా అమ్మకే తెలుసు. కాబట్టి నేను ఇప్పుడే అమ్మను అడిగి వస్తాను' అని ఆయనతో చెప్పి, కాళికాలయానికి వెళ్ళారు. కొద్దిసేపటిలో తిరిగి వచ్చి, 'వేదాంత సాధనలను అభ్యసించడానికి అమ్మ నాకు అనుమతి ఇచ్చింది' అని తోతాపురితో అన్నారు.

అందరి ఎదుటా నరేంద్రుడు అవమానించినప్పుడు శ్రీరామకృష్ణులు బాధపడలేదు. తోతాపురి 'నీకు అద్వైత సాధనల్ని నేర్పుతాను' అని అభిమానంగా అన్నప్పుడు ఆనందించలేదు. శ్రీరామకృష్ణుల్ని ఎవరు అవమానించినా, అభినందించినా సర్వకాల సర్వావస్థల్లోనూ సర్వేశ్వరిపైనే సంపూర్ణంగా ఆధారపడ్డారు. మనం కూడా ఆ జగన్మాతను శరణు వేడితే మానావమానాలకు అతీతులం కాగలం.

అమ్మను అంగీకరించిన అద్వైతవాది: నిర్వికల్ప సమాధి స్థితులను అనుభవించిన తోతాపురి, అమ్మ ప్రేమలోని మాధుర్యాన్ని ఆస్వాదించలేదు. శ్రీరామకృష్ణులు సాధారణ సాధకునిలా చేతులు చరుస్తూ అమ్మ నామస్మరణ చేయడం చూసిన తోతాపురి 'నిర్వికల్ప అనుభూతులను పొందిన తరువాత కూడా చేతులు చరుస్తూ చపాతీలు చేస్తున్నావు' అని శ్రీరామకృష్ణులను పరిహసించాడు. అందుకు శ్రీరామకృష్ణులు 'బ్రహ్మం- బ్రహ్మశక్తి అభేదం. అమ్మ అనుగ్రహంతో మీకు ఇది అవగతం కాగలదు' అని బదులిచ్చారు. తర్వాత తోతాపురి అమ్మ శక్తిని ఎలా అంగీకరించాడో తెలిపే ఓ సంఘటన:

ఒకసారి తోతాపురి రక్తగ్రహణి వ్యాధికి గురయ్యాడు. అందువల్ల అతడు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడసాగాడు. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేకపోయింది. సదా ఆత్మానుభూతిలో మునిగి ఉండే తోతాపురికి ఇప్పుడు దేహ ధ్యాస మొదలైంది. కడుపునొప్పి మరింత అధికమవడంతో, బాధను భరించడం కన్నా దేహత్యాగం చేయడం ఉత్తమమని తలచి, అర్ధరాత్రి వేళ గంగానది వైపు బయలుదేరాడు. అయితే, గంగానదిలోకి ఎంత దూరం వెళ్ళినా నీళ్ళు మోకాళ్ళ లోతు మించలేదు. ఈ విపరీత పరిణామానికి తోతాపురి దిగ్భ్రాంతి చెందాడు. అప్పుడు అతనికి ఓ దివ్య దర్శనంలో నేల మీదా, నీటి మీదా, ఆకాశంలోనూ సర్వత్రా జగజ్జననియే కనిపించింది. జగన్మాత అవ్యక్త విశ్వరూప దర్శనాన్ని కాంచిన తోతాపురి 'అమ్మా! అమ్మా!' అని విలపిస్తూ, 'అమ్మా! బ్రహ్మం - బ్రహ్మశక్తి అభేదం. సర్వం నీ మాయాధీనమే అని గ్రహించాను' అని అమ్మ చరణాల వద్ద ప్రణమిల్లాడు. ***'సైషా ప్రసన్నా వరదా నృణాం భవతి ముక్తయే'*** *(దేవీ మాహాత్మ్యం 1-56)* - 'అమ్మ కృపతోనే ముక్తి సాధ్యం'అని తోతాపురి గ్రహించాడు.

'మాతృభావం'లోని మాధుర్యం: భగవంతుణ్ణి చేరుకోవడానికి భక్తితత్త్వం ఐదు భావాలను సూచిస్తుంది. అవి: శాంత భావం (మాతృభావం), దాస్య భావం, సఖ్య భావం, వాత్సల్య భావం, మధుర భావం.

అమ్మ ఒడిలో ప్రశాంతంగా సేద తీరే పసివాడికి ఏది అవసరమో దాన్ని తల్లి సమకూరుస్తుంది. తల్లి ఆలనాపాలనలో సురక్షితంగా జీవితాన్ని సాగించే పసివాని స్థితికి చేరుకోవాలంటే భగవంతుణ్ణి 'మాతృభావం'తో ఆరాధించాలి. ఆ మాతృభావం తోనే శ్రీరామకృష్ణులు జగన్మాతను దర్శించారు. నిరంతరం అమ్మ సన్నిధిలో చరిస్తూ అన్ని భక్తి సాధనలూ, తాంత్రిక సాధనలూ, వేదాంత సాధనలూ, ఇతర మత సాధనలూ అభ్యసించి పరిపూర్ణులయ్యారు. ఒక్క జీవిత కాలంలో అన్ని మత సాధనలను అభ్యసించి సఫలీకృతులు కావడం కేవలం శ్రీరామకృష్ణులకే సాధ్యమైంది.

సర్వధర్మాలనూ అనుష్ఠించిన శ్రీరామకృష్ణులు, 'ఇదంతా అమ్మ అనుగ్రహం వల్లే సాధ్యమైంది' అని మాతృ భావంలోని విశిష్టతను చాటిచెప్పారు.

ఆధునిక ప్రపంచంలో ఎదురయ్యే ఆకర్షణలను అధిగమించి గమ్యాన్ని చేరుకోవాలంటే దృఢ సంకల్పం, ఏకనిష్ఠ, పురుషప్రయత్నం అవసరం. ఇవన్నీ ఉన్నా గమ్యం చేరేవరకూ అంతా అగమ్యగోచరంగానే ఉంటుంది. కాబట్టి శ్రీరామకృష్ణుల లాగ అమ్మ ఒడిలో ఓలలాడే భాగ్యాన్ని సంపాదించుకుంటే ఏ ఆకర్షణలూ మనల్ని దారి మళ్ళించలేవు. అందువల్ల శ్రీరామకృష్ణులు చూపిన 'మాతృభావం' అనే బాటలో మన ఆధ్యాత్మిక యాత్రను కొనసాగిద్దాం, జగన్మాత చరణాలను చేరుకొందాం. ❖

కార్య సాఫల్యత

– స్వామి సుప్రియానంద

పని చేయకుండా ఒక్క క్షణమైనా మనం జీవించలేం! "న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠ త్య కర్మకృత్..." (భగవద్గీత 3-5) ఒకోసారి విసుగుపుడుతుంది. అంతా అగమ్య గోచరంగా ఉంటుంది. పని 'సుడిగుండం' నుండి బయట పడాలనుకుంటాం. ప్రశాంతతను కోరుకుంటాం. కానీ అది ఎలా సాధ్యం?

"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన..." (భ.గీ. 2-47) పనిచేయడానికి మాత్రమే కాని దాని ఫలానికి నువ్వు

అధికారివి కావు. మొదట్లో ఇది "నిరంకుశత్వం" గా అనిపించినా, దీనిలో 'ప్రశాంతత' కు దారిచూపే సూత్రం దాగి ఉంది.

మన ప్రమేయం లేకుండా జరిగే పనులు (గుండె కొట్టుకోవడం లాంటివి) కాకుండా మనం చేతనావస్థలో చేసే పనుల గురించే ఈ విశ్లేషణ. ఒక పనిని మన మనః స్థితిని అనుసరించి 1. కర్తవ్యం(Duty) 2. బాధ్యత (Responsibility) 3. ధర్మం (Righteousness) అనే మూడు స్థాయిలలో నిర్వర్తిస్తాం. ఇప్పుడు వీటిని విపులంగా పరిశీలిద్దాం.

1. కర్తవ్యం (Duty) : "ప్రతి వ్యక్తీ ఎలా కర్మచేస్తున్నాడో చూస్తున్నారు కదా! ఎవరికీ పూర్తి విరామం లేదు; నూటికి తొంభైతొమ్మిది మంది బానిసలలా పనులు చేస్తుంటారు. దుఃఖమే దానికి ఫలితం" అంటారు స్వామి వివేకానంద. ఆయనే కర్తవ్యాన్ని "మధ్యాహ్నపు మండుటెండ (Duty is midday's scorching sun) అని" వర్ణిస్తారు. దీనికి కారణం – కర్తవ్య నిర్వహణ అహంకార మిళితం. అందుకే ఈ పని 'ఇలా ఉంది' 'అలా ఉంది' అని గొణుక్కుంటూ చేస్తాం. ఒత్తిడికి గురి అవుతాం.

2. బాధ్యత (Responsibility): ఒక పని 'కర్తవ్య' స్థాయి నుండి 'బాధ్యత' స్థాయికి ఎదిగినప్పుడు దానిని మనం చక్కగా నిర్వహించగలుగుతాం. 'బడికి వెళ్ళడం తన కర్తవ్యంగా భావించిన విద్యార్థి 'చదువుకోవడం' తన బాధ్యతగా గుర్తిస్తే అతను మంచి విద్యార్థిగా మారే అవకాశం ఉంటుంది. కానీ ఒక పనిని బాధ్యతతో చేసినప్పుడు ఆ పని మీద మనకు 'మమకారం' పెరుగుతుంది. ఈ 'మమకారం' మనం చేసే ప్రతీ పని నుండి 'ప్రతిఫలం' కోరుకుంటుంది. దీని నుండి పుట్టిన 'ఫలాపేక్ష' ఓటమిని ఓర్చుకోలేదు. అప్పుడు మనస్సు నిరంతరం ఒత్తిడి, స్పర్ధ, సంఘర్షణలకు లోనవుతుంది.

3. ధర్మం (Righteousness) : మనల్ని అహంకార, మమకారాల బారినుండి రక్షించేదే నిస్సంగత్వం. ఇది సత్సంగత్వం వలన లభిస్తుంది. అంటే ధర్మంతో సాంగత్యం – ధర్మనిరతి కలిగి ఉండటం. అందుకే మన పెద్దలు "ధర్మో రక్షతి రక్షితః" (ధర్మాన్ని మనం ఆచరిస్తే అది మనల్ని రక్షిస్తుంది) అన్నారు.

మనం చేసే పనిలో ధర్మాన్ని పాటించినప్పుడు ఆ పని మనల్ని స్వతంత్రులను (ముక్తుల్ని) చేస్తుంది. అప్పుడు మనం స్వామి వివేకానంద చెప్పినట్లు బానిసలలాగ కాక యజమానులుగా పనిచేయగలుగుతాం. అదే 'పని సాఫల్యత' 'కర్మయోగం'.

యంత్రాలు, పరికరాలు కూడా పనిచేస్తాయి. కాని వాటికి 'ధర్మాధర్మాలు' తెలియవు. ఈ సందర్భంలో 'ధర్మనిష్ఠ'తో చేసే పని ఏదీ హేయమైనది కాదు, పైపెచ్చు అది ఒక "యోగాభ్యాసం" అని తెలియజెప్పే మహాభారతంలోని "వ్యాధగీత"ను (యోగి పుంగవుడికి కసాయివాడి ప్రవచనం) ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకుందాం. ❖

పరమపద ప్రాప్తికి భగవన్నామ జపం

– స్వామి జ్ఞానదానంద



మన పూజామందిరాల్లో ఉదయం, సాయంత్రం కూర్చొని, జపమాల పుచ్చుకొని మంత్రాన్ని జపిస్తూ ఉంటాం. కానీ దాని రుచిని ఆస్వాదించలేక పోతున్నాం. పతంజలి మహర్షి ఇలా వచించారు: “భక్తివిశ్వాసాలతో సుదీర్ఘ కాలం అభ్యాసం చేయగలిగితే భగవత్ చైతన్యంలో సుప్రతిష్ఠులం కావచ్చు”. మనోనిగ్రహం ఒక్క రోజులో సాధ్యం కాదు. చిరకాలం నిరంతర సాధన చేసినప్పుడే అది సిద్ధిస్తుంది. జపం ద్వారా అంతరంగ ఆధ్యాత్మిక జగత్తులోకి ప్రవేశించడానికి ఎంతో సహనం అవసరం.

ఒక మధ్యాహ్న వేళ ఒక వ్యక్తి చలనచిత్రం ప్రారంభమైన పదిహేను నిమిషాల తరువాత థియేటర్‌లోకి వెళ్ళాడనుకోండి. అత్యవసర నిష్క్రమణను సూచించే ఎర్రని ప్రతీక, తెర మీద కనిపించే వెలుగు తప్ప చుట్టూ అతడికి చీకటే కనిపిస్తుంది. లోపలికి వచ్చిన కాసేపటికి మెల్లగా కుర్చీల వరుసలు కనిపిస్తాయి. తన కుర్చీ ఎక్కడుందో చూడగలుగుతాడు. అదే విధంగా జపధ్యానాల వెలుగు వల్ల హృదయాంధకారం తొలగిపోతుంది. తరువాత ఆనందం కలుగుతుంది. తులసీదాస్ “గడప వద్ద ఉంచిన దీపం గది లోపలా, బయటా వెలుగును ప్రసరింపజేస్తుంది. అలాగే భగవన్నామ జపం మన బాహ్యాంతరాలను ప్రకాశవంతం చేస్తుంది” అంటారు.

తీవ్రత కొరవడిన ఆధ్యాత్మిక సాధనలు ఉప్పు లేని కూరల లాంటివి. పశుగ్రాసం, తెలకపిండిల మిశ్రమాన్ని ఆవులు ఎలా ఇష్టపడతాయో, అలా భక్తితో భగవన్నామాన్ని జపించగలిగితే జనులకు ఆధ్యాత్మిక జీవితం పట్ల ఇష్టం ఏర్పడుతుంది. వ్యాసమహర్షి ఇలా వచించారు: “జీర్ణక్రియకు తోడ్పడే పైత్యరస స్రావంలో అస్తవ్యస్తత ఏర్పడినప్పుడు చక్కెర రుచించదు. కానీ ప్రతి రోజూ అక్కరతో చక్కెర తింటూ ఉంటే క్రమంగా చక్కెర రుచిని అనుభవించవచ్చు, ఆ రుగ్మత అంతరించిపోతుంది. అదే విధంగా అజ్ఞానంలో ఉన్నవారికి భగవన్నామం రుచించదు. కానీ సక్రమంగా ఆధ్యాత్మిక సాధనలు అనుష్ఠిస్తూ వస్తే, అజ్ఞానం అదృశ్యమై పోయి భగవన్నామం పట్ల రుచి ఏర్పడుతుంది.”

కొన్ని సమయాల్లో ఇన్‌ఫ్లుయెంజా జ్వరం ఒక వ్యక్తి రుచిని హరించివేస్తుంది; కానీ ఆహారంలో కాస్త ఊరగాయను జోడిస్తే రుచి కాస్త మెరుగవుతుంది. ఆ ఊరగాయ భక్తి. ఒక త్రాగుబోతు మద్యం గురించి వినడానికి ఇష్టపడతాడు. ఒక మద్యం సీసాను చూసినప్పుడు అతడి మనస్సు ఆనందంతో నృత్యం చేస్తుంది. ఆ సీసా మూత తీసినప్పుడు అతడికి మత్తు ప్రారంభమవుతుంది. మహదానందంతో సీసా మొత్తం త్రాగేస్తాడు. చివరికి అతడు ప్రపంచాన్ని మరచిపోయి దారి ప్రక్కన స్పృహతప్పి నేల మీద పడిపోతాడు. నిజానికి అలాంటి ఉల్లాస భరితమైన మత్తు భగవన్నామ జపం వలన కలుగుతుంది. శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: “గంజాయి అనే మాటను పలుమార్లు ఉచ్చరించినంత మాత్రాన మత్తు కలుగుతుందా? గంజాయి ఆకు తెచ్చి, దాన్ని నూరి నీళ్ళలో కలిపి త్రాగాలి. మీరు గృహస్థ జీవితం గడుపుతున్నారు కనుక మీ మనస్సును భగవచ్చింతనతో ఉన్మత్తం గావించుకోండి. మీరు మీ కర్తవ్యాలు నిర్వహిస్తూ ఉండండి, కానీ ఆహ్లాదకరమైన ఉన్మత్తతను అలాగే నిలుపుకోండి.”

రూపగోస్వామి ‘విదగ్ధమాధవ్’ గ్రంథంలో ఇలా వివరించారు: “రెండు అక్షరాల ‘కృష్ణ’ అనే పదంలో ఎంత అమృతం ఉందో నాకు తెలియదు. ఒక్క నోటితో ఆయన నామాన్ని జపించడంతో నాకు తృప్తి లేదు. నాకు లక్ష నోళ్ళు ఉండాలని కోరుతున్నాను. ఆయన నామాన్ని ఆలకించడానికి నాకు లక్ష చెవులు ఉండాలి. ఈ నామం నా మనస్సులో కంపించినప్పుడు నా ఇంద్రియాలన్నీ వివశమయ్యాయి.”

భక్తి విశ్వాసాలతో భగవన్నామాన్ని నిరంతరం జపించడం ద్వారా పరమపదాన్ని చేరుకోవచ్చు. ❖

మహాపురుషుల్లోని మహోన్నత లక్షణం !

- స్వామి వీరేశ్వరానంద*

స్వామి వివేకానంద పట్ల స్వామి అఖండానందజీ (గంగాధర్ మహరాజ్) అత్యంత భక్తి శ్రద్ధలు కలిగి ఉండేవారు. నేను (స్వామి వీరేశ్వరానంద) 'అద్వైత ఆశ్రమం'లో ఉండేవాణ్ణి.

ఒకసారి గంగాధర్ మహరాజ్ కలకత్తా వచ్చి, 'పుటియారాణి' ఇంట్లో బస చేసారు. ఒక భక్తుడు అద్వైత ఆశ్రమ సాధువుల కోసం రసగుల్లాలు తెప్పించారు. మా భోజనాలు పూర్తవక ముందే 'ఉద్బోధన్' కార్యాలయం నుంచి ఒక సన్న్యాసి అక్కడకు వచ్చారు. అతనికి కూడా మిఠాయిలు ఇవ్వడం జరిగింది. తరువాత అతను గంగాధర్ మహరాజ్ దగ్గరకు వెళ్ళి, "మహరాజ్! ఈ రోజు అద్వైత ఆశ్రమంలో చాలా పెద్ద 'భండారా' (విందు భోజనం) అయింది. వారు మిమ్మల్ని విందు భోజనానికి ఆహ్వానించలేదా? అని అడిగాడు. గంగాధర్ మహరాజ్ చిన్న పిల్లవాడిలాగ "అలాగా! నేను ఇక్కడే ఉన్నాను, మరి ప్రభు (వీరేశ్వరానంద) నాకు ఆహ్వానం పంపించలేదే!" అన్నారు.

కొన్ని రోజుల తరువాత నేను గంగాధర్ మహరాజ్‌ను కలవడానికి వెళ్ళాను. ప్రణామం చేసిన తరువాత వారి చరణాల దగ్గర కూర్చున్నాను. కానీ గంగాధర్ మహరాజ్ ఏమీ మాట్లాడకుండా మౌనంగా కూర్చున్నారు.

కొన్ని క్షణాల తరువాత గంభీర స్వరంతో "నేను నీతో కొంచెం మాట్లాడాలి" అన్నారు. దానికి, "నేను కూడా మీతో కొంచెం చెప్పాలి" అని జవాబిచ్చాను. "నువ్వు ఏం చెప్పాలనుకుంటున్నావు?" అని గంగాధర్ మహరాజ్ అడిగారు. అందుకు నేను, "ముందు మీరు ఏమి చెప్పాలనుకుంటున్నారో చెప్పేయండి. మీ తరువాత నేను చెప్పవలసింది చెబుతాను" అన్నాను. అది విని ఆయన చిన్నపిల్లాడిలాగా, "అయితే న్యాయాధికారిని నిర్ణయించు" అన్నారు. "మీరే న్యాయాధికారి" అని నేను అన్నాను.

గంగాధర్ మహరాజ్ : స్వయంగా దావా వేసిన నేనే న్యాయాధికారిని ఎలా అవుతాను?

నేను: మీ మీద నాకు నమ్మకం ఉంది.

అలాగైతే సరే అని "అద్వైత ఆశ్రమంలో అంత పెద్ద భండారా జరుపుకున్నారు. నేను ఇక్కడే ఉన్నాను. మరి నువ్వు నన్ను విందుకు ఆహ్వానించలేదు ఎందుకు" అని గంగాధర్ మహరాజ్ అడిగారు.

అప్పుడు నేను అలాంటిదేదీ లేదంటూ, జరిగినదంతా వారికి వివరంగా చెప్పి, చివరిగా ఇలా అన్నాను: "ఈ సన్న్యాసి నాకు వ్యతిరేకంగా చెప్పినదానిలో సత్యాసత్యాలు తెలుసు కోకుండా మీరు నా మీద నేరం ఆరోపించారు. 'ఒక వేళ ఎవరైనా ఏదైనా తప్పు చేసినట్లయితే వారిని పిలిచి అడగాలి. మిగిలిన వారితో కొంచెం కూడా చర్చించ కూడదు' అని స్వామి వివేకానంద చెప్పే వారు. అయితే మీరు స్వామీజీ సూచనను ఉల్లంఘించడం సబబు కాదు కదా!"

నేను ఈ విధంగా చెప్పిన వెంటనే "నువ్వు చెప్పింది నిజమే ప్రభు. నిజానిజాలు తెలుసుకోకుండా నీపై నేరారోపణలు చేశాను. తప్పంతా నాదే!"అని ఎంతో వినయంగా తన తప్పును అంగీకరించారు గంగాధర్ మహరాజ్.

ఈ సంఘటనలో రెండు విషయాల్ని మనం గమనించవచ్చు. ఒకటి – స్వామీజీ మాటల మీద స్వామి అఖండానందజీకి ఉన్న గౌరవం. రెండోది – రామకృష్ణ సంఘానికి సర్వాధ్యక్షులై ఉండి కూడా నాలాంటి సామాన్య వ్యక్తి ముందు తన తప్పును ఒప్పుకోవడం.

సాధారణంగా మనకన్నా వయస్సులోగానీ, అధికారంలో గానీ చిన్నవారెవరైనా మన తప్పులను ఎత్తిచూపినప్పుడు మనం అంగీకరించడానికి ఎంతమాత్రం సుముఖత చూపం. అదే మహాపురుషులకూ, సామాన్యులకూ గల తేడా! ❖

(*రామకృష్ణ సంఘ పదవ సర్వాధ్యక్షులు స్వామి వీరేశ్వరానంద స్మృతుల నుంచి)

(సెప్టెంబర్ 18, శుక్రవారం – శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన **స్వామి అఖండానంద జయంతి**)

పరమేశ్వరుని పరిరక్షణలో ...

స్వామి జపానంద స్వీయ అనుభవాలు -27

దివాన్‌జీ నేర్చుకున్న పాఠం

స్వామి జపానంద సూరత్‌లో ఉండగా ఆయన ఆరోగ్యం పాడైంది. అందుకని కొంచెం విచారంగా ఒక శివాలయంలో కూర్చొని ఉన్నారు. ఒక గౌడ బ్రాహ్మణుడు శివాలయంలో అర్చన చేసుకొని వచ్చి స్వామిని పలకరించి మాటలు మొదలుపెట్టాడు. ఇది వరకే పరిచయం ఉన్నవాడిలా ఆయన మాట్లాడుతూ ఉంటే ఎంతో ఆత్మీయుడిలా అనిపించాడు. చాలాసేపు మాట్లాడుకున్న తరువాత "మీ భోజనం విషయం ఏమిటి? ఎక్కడ తింటారు?" అని ఆయన అడిగాడు. "ఎక్కడ దొరికితే అక్కడ" అన్నారు స్వామి.

తన గ్రామమైన సచ్చీన్‌కి రమ్మనీ, ఆరోగ్యం బాగుపడేవరకూ తమతోనే ఉండమనీ ఆయన స్వామిని కోరాడు. "ఎన్ని రోజులు ఉండాలంటే అన్ని రోజులు మీరు అక్కడ ఉండవచ్చు. మీరు మాతోపాటే ఉంటే మాకు సత్సంగభాగ్యం కూడా లభ్యమవుతుంది. అక్కడ మా అక్క ఉంది. ఆమె ఎప్పుడూ జపధ్యానాలలోనే సమయాన్ని వినియోగిస్తుంది. నన్ను ఎన్నో ధర్మ సందేహాలు అడుగుతుంది. కానీ నాకు అంత పరిజ్ఞానం లేకపోవడం వల్ల ఆమె సందేహాల్ని తీర్చలేకపోతున్నాను. నాలుగు మంచి మాటలు నేర్చుకుందామన్నా, మనశ్శాంతి కోసం వెళ్దామన్నా మాకు దగ్గరలో ఏ ఆశ్రమమూ లేదు" అన్నాడు.

సన్న్యాసి (స్వామి జపానంద) అంగీకరించి వెంటనే గ్రామానికి బయల్దేరారు. స్వామి జపానంద తాలూకు కంబళి, కమండలం పట్టుకొని ఆ బ్రాహ్మణుడు ఆయనతో పాటే నడిచాడు. టికెట్లు కొనుక్కుని బండిలో కూర్చున్నాక మాటల్లో పడ్డారు. రైలు బండి సాయంత్రం సుమారు ఐదు గంటలకు సచ్చీన్ చేరింది.

ఆ బ్రాహ్మణుడి ఇంట్లోని వారు సాధువును చూసి చాలా ఆనందించారు. ఒక మంచి గదిలో ఆయనకు బస ఏర్పాటు చేశారు. ఆ ఇంట్లో అందరూ సాత్త్విక గుణాలు కలవారిలా కనిపించారు. ఆ ఇల్లే ఋషుల ఆశ్రమంలా అనిపించింది. సన్న్యాసి చాలా సంతోషించారు.

రాత్రి చాలా సమయం వరకూ ఆధ్యాత్మిక విషయాలు చర్చించుకున్నారు. బ్రాహ్మణుడు కూడా స్వామి గదిలోనే నిద్రపోయాడు. పడుకునే ముందర స్వామి "నాకు తెల్లవారుజామునే లేవడం అలవాటు. తాడు, బాల్చీ ఇక్కడపెడితే నేను లేచి బావి నుంచి నీళ్ళు తోడుకుంటాను. దాని కోసమని మీ అందరినీ నేను ఉదయమే లేపనక్కర లేదు" అన్నారు. బ్రాహ్మణుడు నవ్వి, "మీరు ఎన్ని గంటలకు లేస్తారు? మా అక్క రోజూ మూడున్నర, నాలుగు గంటలలోపే నిద్రలేస్తుంది. కాబట్టి ఆమె మీకు అన్నీ సమకూర్చి పెడుతుంది" అన్నాడు.

ఉదయం లేచేసరికి నీళ్ళు సిద్ధంగా ఉన్నాయి. స్నానాదికాలు కానిచ్చి సన్న్యాసి అలా బయట కొంచెం దూరం నడచి వద్దామని బయల్దేరారు. బాటకు రెండు వైపులా చాలా దూరం వరకూ తుమ్మచెట్లు ఉన్నాయి. తోవ అంతా పసుపు పచ్చటి తుమ్మ పువ్వులు, తుమ్మ ముళ్ళతో నిండి ఉంది. చెప్పులు లేకుండా నడవడం చాలా కష్టం. పక్క ఊరి నుండి వచ్చే కూరలు, పళ్ళు, పాలు అమ్మేవాళ్ళు, రోజు కూలీ పని చేసుకునే వాళ్ళందరూ వాళ్ళ పనుల మీద ముళ్ళబాట మీదే నడుస్తూ పోతున్నారు. జోళ్ళు కూడా లేకుండా నడుస్తుండడం

వల్ల వాళ్ళ కాళ్ళకు ముళ్ళు గుచ్చుకుంటున్నాయి. వాటిని తీసుకుంటూ నడుస్తూండడాన్ని చూసి సన్న్యాసికి చాలా బాధ కలిగింది.

సన్న్యాసికి కొంచెం దూరంలో ఒక ఖర్జూరం చెట్టు కనిపించింది. ఆ చెట్టు మట్ట ఒకటి కోసి తెచ్చి, దానితో చీపురులా చేసి సన్న్యాసి బాట మధ్య భాగంలో ఊడవడం మొదలుపెట్టారు. ఆ మార్గంలో వెళ్ళుతున్న వాళ్ళంతా సన్న్యాసిని చూసి నవ్వుతున్నారు. అయినా సన్న్యాసి కష్టపడి ముళ్ళు పక్కకి నెడుతూ ఉన్నారు. రెండు పక్కలా కలిపి సుమారు రెండు వందల చెట్లు ఉన్నట్లున్నాయి. ఇంతలో ఒక

నడివయస్కుడైన వ్యక్తి అక్కడికి వచ్చి, "ఇదేమిటి మహరాజ్! ఏం చేస్తున్నారు మీరు?" అని అడిగాడు. "ఏమీ లేదు. ఈ ముళ్ళ బాటలో మనుష్యులు చాలా కష్టపడి నడుస్తున్నారు. అందుకని ముళ్ళను ఊడుస్తున్నాను" అని అన్నారు సన్న్యాసి. "చెట్లు కొట్టి వేస్తే కాని ఈ ముళ్ళబాధ తప్పదు" అన్నాడు ఆ వ్యక్తి.

"చెట్లు నాటిన వాళ్ళెవరో కావాలనే బాటకు రెండు వైపులా తుమ్మ చెట్లు నాటినట్లున్నారు. భారత దేశంలో చెప్పులు కొనుక్కోలేని బీదవాళ్ళు వేల మంది ఉన్నారని వాళ్ళకు తెలియదేమో! ఈ విషయం నవాబుగారి దృష్టికి తేవాలి. కనీసం రోజుకొకసారైనా ఈ బాట ఊడ్చి, శుభ్రం చేసే ఏర్పాటు జరిగితే వీరి కష్టం దూరం అవుతుంది" అన్నారు సన్న్యాసి.

"అవును. అదేం కష్టమైన పని కాదు. అలాంటి ఏర్పాటు చెయ్యవచ్చు. మహరాజ్! ఆ చీపురు నాకివ్వండి. నేను కూడా కొంచెం దూరం ఊడుస్తాను" అంటూ సన్న్యాసి చేతిలో నుంచి చీపురు తీసుకుని ఆ వ్యక్తి కూడా కొంత మేర శుభ్రం చేశాడు. ఇదంతా అందరూ వింతగా చూస్తూ పక్క నుంచి వెళ్ళిపోయారు. కానీ ఇప్పుడు ఎవరూ నవ్వలేదు. అప్పుడు సన్న్యాసికి అతను ఊరిలో పేరు ప్రతిష్ఠలున్న వ్యక్తి అని అర్థమయింది.

సన్న్యాసి గౌడ బ్రాహ్మణుని ఇంట్లో బస చేస్తున్నారని తెలిసి, ఆ వ్యక్తి "మహరాజ్! గౌడ చాలా మంచి మనిషి. ధర్మపరాయణుడు. మీరు మా ఇంటికి కూడా విచ్చేయండి. ఇక్కడ నుంచి ఐదు నిమిషాలు నడక అంతే" అన్నాడు. సన్న్యాసి ఆ వ్యక్తితో కలిసి వాళ్ళ ఇంటికి వెళ్ళారు. ఇంటి దగ్గరకు వెళ్ళగానే చౌకీదారు సలాం చేశాడు. గేటు మీద 'దివాన్ సాహెబు సచ్చీన్ స్టేట్' అని వ్రాసి ఉంది. దివాన్‌గారు సన్న్యాసిని లోపలికి తీసుకువెళ్ళి, కూర్చోమని చెప్పి, టీ తెప్పించారు. "మహరాజ్! నేను ఈ వేళ మీ దగ్గర మంచి పాఠం నేర్చుకున్నాను. రోజూ ఉదయం నేను ఆ బాటలోనే నడుస్తాను. అయినా ఆ ముళ్ళ విషయం నాకెప్పుడూ తట్టలేదు. అంటే నేను చూసి కూడా ఏమీ పట్టించుకోలేదన్నమాట. అందుకే సాధు సన్న్యాసులతో సహజీవనం చెయ్యాలి అంటారు పెద్దలు. నేను కూడా ఎంతో కొంత సేవ చేయగలిగినందుకు సంతృప్తిగా ఉంది" అన్నాడు.

స్వామి జపానంద ఆ ఊర్లో ఐదారు రోజులున్నారు. రోజూ ఆ వ్యక్తి సన్న్యాసితో కలిసి ఆ బాట మీద నడుస్తూ అనేక ఆధ్యాత్మిక చర్చలు చేసేవాడు. ధార్మిక భావన ఉన్న చోటే మానవత్వం ఉంటుంది. ❖ **అనువాదం: శ్రీమతి జి.ఎస్. లక్ష్మి**

సకల దేవతాంశల సమన్వయమూర్తి

హరి హర బ్రహ్మేంద్రాదులందరి అంశలూ కలసి ఏర్పడిన మహామాయా దేవికి దేవతలందరూ సకల ఆయుధాలు, సకల ఆభరణాలు సమకూర్చారు. క్షీరాబ్ధి దేవత దివ్యవస్త్రాలనూ; విశ్వకర్మ వెలుగులు విరజిమ్మే చూడామణినీ, కటక కుండలాలనూ, కేయూర కంకణాలనూ; త్వష్ట ప్రజాపతి రత్న ఖచిత నూపురాలనూ; సముద్రుడు కంఠాభరణాలనూ, రత్నాంగుళీయకాలనూ; వరుణుడు వాడిపోని పద్మాలమాలనూ, వైజయంతినీ; హిమవంతుడు వివిధ రత్నాలతో పొదిగిన కనక సింహాసనాన్నీ సమకూర్చారు. సింహ వాహనం మీద నానావిధ భూషణాలతో విరాజిల్లే ఆ మహామాయాదేవికి విష్ణువు వేయి అంచుల చక్రాన్నీ; శివుడు త్రిశూలాన్నీ; వరుణుడు శంఖాన్నీ; అగ్ని మనోవేగంతో పోగలిగి, వందమందిని మట్టుపెట్టే శక్తి; వాయుదేవుడు అక్షయ తూణీరాలనూ, దివ్యమైన ధనుస్సునూ ఇచ్చారు. ఇంద్రుడు వజ్రాయుధాన్ని ఇచ్చాడు. యముడు దండాన్నీ; విశ్వకర్మ పరశువునూ ఇచ్చి – అందరూ వివిధ వేదమంత్రాలతో దేవిని స్తుతించారు. ఈ మహామాయాదేవియే – మదంతోనూ, కామంతోనూ విర్రవీగే మహిషాసురుణ్ణీ, వాడిని ఆశ్రయించుకొని ఆగడాలు చేసే అసుర వీరులందరినీ చీల్చి చెండాడి ముల్లోకవాసులను రక్షించింది. ❖

దేవీ వైభవం

ప్రవచనం: శ్రీ సామవేదం షణ్ముఖశర్మ విలేఖనం: శ్రీమతి ఎన్. శేషు

(...గత సంచిక తరువాయి)

సురథుడు "నాకు మళ్ళీ నా రాజ్యం కావాలి, నేను రాజ్యాన్ని ఏలాలి" అని అమ్మవారిని కోరుకున్నాడు. రథం అంటే శరీరం. సురథుడు అంటే మంచి శరీరం కలవాడు. నేను శరీరం ఉన్నవాడను, ఇంద్రియాలు ఉన్నవాడను అనే స్పృహ అతడికి ఉంది. ఈ దేహం ద్వారా సత్కర్మ చెయ్యాలి, సత్కర్మ ద్వారా దేహాన్ని పోషించాలి. ఆ జగన్మాత సురథుడి కోరికను సమ్మతించింది. అమ్మ అనుగ్రహంతో అతడికి పోయిన రాజ్యం వచ్చింది, హాయిగా సంపదలన్నీ అనుభవించాడు. అక్కడితో అయిపోలేదు. "వాంఛా సమధికం"-నాయనా! నువ్వు ఇప్పుడు రాజ్యాన్ని పొందుతావు. ఆ తరువాత నువ్వు సూర్య తేజస్సులో లీనమవుతావు. తిరిగి పరమాత్ముడైన ఆ సూర్యుని తేజస్సుతో నువ్వు ఆవిర్భవిస్తావు. సావర్ణి అనే మనువు అవుతావు" అంది అమ్మ.

సమాధి "మోహకూపం నుంచి బయట పెట్టే ఆత్మ జ్ఞానాన్ని ఇవ్వమ్మా" అన్నాడు. అందుకు అమ్మ మోక్షాన్నిచ్చింది, కైవల్యాన్నిచ్చింది, ఆత్మజ్ఞానాన్నిచ్చింది. ఇలా ఇద్దర్నీ ఆ తల్లి అనుగ్రహించింది. సమాధి అనేది సాధనను తెలియజేస్తుంది. సమాధి అంటే సమత్వ బుద్ధిలో బుద్ధిని ఉంచడం అని అర్థం. సురథుడు అనేది శరీరాన్ని తెలియచేస్తుంది. బ్రతుకు సురథం చేసుకోవాలి. సురథుడు శరీరానికీ, ఇంద్రియాలకీ సంకేతం. సమాధి బుద్ధికి సంకేతం. ఈ రెండూ అమ్మకు అర్పించినప్పుడు ఆ తల్లి 'లోకయాత్రా విధాయినీ' అయి ధర్మం చెడకుండా శరీరయాత్ర సలుపుతూ ఉంటుంది, మోహం నుండి రక్షిస్తూ ఉంటుంది.

బ్రహ్మ విద్యాస్వరూపిణి అయిన జగదంబికను ఆశ్రయిస్తే ఐహిక సంపదలు, కైవల్యజ్ఞానం కూడా అమ్మ ఇస్తుంది. కనుక ఇహం, పరం, పరమార్థం ఇవ్వగలిగే తల్లి జగదంబిక అని వ్యాసదేవుడు మార్కండేయ పురాణంలో చెప్పారు.

"లోకాలన్నిటికీ ఏకైక దిక్కు అమ్మ. పిపీలికాది బ్రహ్మలోక పర్యంతం అమ్మ చరణాలే దిక్కు" అని శంకర భగవత్పాదులు అన్నారు. అమ్మ కావాలని ఆ చరణాలను ఆశ్రయిస్తే ఇహం, పరం, సర్వం - ఆ తల్లి అందచేస్తుంది. అందుకు సదా అమ్మను శరణు వేడాలి.

సర్వజగత్తులో మోహాన్ని వ్యాపింపజేసి, ఆ మోహాన్ని ఉపసంహరింపజేసి మోక్షాన్నిస్తుంది. భీష్మపితామహుడు అంపశయ్య మీద ఉండి, శ్రీకృష్ణ పరమాత్ముణ్ణి "సర్గస్య రక్షణార్థాయ తస్మై మోహాత్మనే నమః" అని స్తోత్రం చేసిన భీష్మస్తవరాజం మహాభారతం శాంతి పర్వంలో వస్తుంది. ఇందులో 'సర్గస్య' అంటే ప్రపంచం. ఈ విశ్వం యొక్క రక్షణ కోసం మోహ స్వరూపుడై ఉన్న నారాయణునికి నమస్కారం అన్నాడు. అక్కడ "నారాయణః" అని పుంలింగంలో ఏ తత్త్వం చెప్పబడుతోందో అదే ఇక్కడ "నారాయణి" అని స్త్రీలింగంలో చెప్పబడుతోంది. అమ్మవారికి నారాయణి, వైష్ణవి అనే రెండు పేర్లున్నాయి.

సప్తశతి, భగవద్గీత ఈ రెండూ ఒకే తత్త్వాన్ని చెబుతాయి. 'దైవీ ఏషా గుణమయీ మమ మాయా దురత్యయా' తన మాయను దాటడం కష్టసాధ్యం అని గీతలో పరమాత్మ చెప్పారు.

జ్ఞానినాం అపి చేతాంసి దేవీ భగవతీ హి సా ।
బలాదాకృష్య మోహాయ మహామాయా ప్రయచ్ఛతి ॥

(దేవీమాహాత్మ్యం -1.55) జ్ఞానులైన వారి మనస్సును కూడా లాగి, మోహంతో జగత్తు వైపు తిప్పుతుంది అమ్మ అన్నారు. లేకుంటే జగన్నిర్వహణ సాధ్యం కాదు. మళ్ళీ సమయమెరిగి ఆ మోహాన్ని తొలగించగలిగేదీ ఆ తల్లే.

తయా విసృజ్యతే విశ్వం జగదేతత్ చరాచరమ్ ।
సైషా ప్రసన్నా వరదా నృణాం భవతి ముక్తయే ॥ (1.56)

అంటున్నది దేవీ మాహాత్మ్యం. సైషా ప్రసన్నా వరదా= సకల వరప్రదాయిని అయిన ఆ జగదంబ అనుగ్రహిస్తేనే ముక్తి సాధ్యం. సంసారం నుండి బయట పడడానికి మనం ఆశ్రయించాల్సింది ఆ తల్లిని మాత్రమే.

మమత్వం అనే లోతైన గుంటలో ఈ ప్రపంచాన్నంతటినీ తిప్పుతుంది అన్నారు. మమత్వం- "నాది" అనే మోహ బద్ధమైన ఒక గహ్వరంలో తిప్పేటటువంటి తల్లి. చండి,

దుర్గ అని ఆ జగదంబను ఆశ్రయించినప్పుడు మనం భావించవలసిన విషయాలివి. సంసారంలో సంచరించే మనం మోహం ద్వారా దెబ్బతినకుండా అది ఎంత మేరకు అవసరమో అంత మేరకు ఉంచి, తరువాత దాని నుండి విమోచనం కూడా కలిగించగలిగే తల్లి కనుక జీవించి ఉన్నంత కాలం అమ్మ చరణాలను ఆశ్రయిస్తే చాలు ఏం కావాలన్నా అమ్మే చూసుకుంటుంది.

ఇక్కడ 'ముక్తయే' అనీ, 'ముక్తేర్హేతు' అనీ రెండు పదాలను చెప్పారు. ఎప్పుడు ఏ కాస్త దుఃఖబంధనం మనకు కలిగినా దాని నుండి విమోచనం చెయ్యగలదా తల్లి. "నృణాం భవతి ముక్తయే" అన్నప్పుడు ఐహికమనీ, "ముక్తేర్హేతు భూత సనాతని" అన్నప్పుడు పరమార్థమనీ అర్థం తీసుకోవాలి. సర్వానికీ ఈశ్వరి అయిన ఆ జగదంబిక ఈ రెండు కార్యాలూ చేస్తున్నది. ఇదే "పశుపాశ విమోచని" అన్న నామానికి వ్యాఖ్యానం.

ఆ తల్లికి 'చండి' అని ఒక పేరుంది. చండి అనగానే ఉగ్ర స్వరూపిణి అని భయపడతాం. దేవతామూర్తులు భోగమూర్తులు, ఉగ్రమూర్తులు, యోగమూర్తులు అని మూడు విధాలుగా ఉంటాయి. భోగమూర్తులను ఆరాధన చేస్తే ఐశ్వర్యాలు, సుఖాలు, శుభాలు కలుగుతాయి. ఉగ్రమూర్తుల్ని ఆరాధిస్తే భూత ప్రేతాది భయాలూ, వ్యాధి, తస్కర గ్రహ ఇత్యాది బాధలూ తొలగిపోతాయి. యోగమూర్తులు లేక శాంత మూర్తులు బ్రహ్మ విద్యను అనుగ్రహిస్తారు. ఏ దేవత ఉపాసనలోనైనా ఈ మూడూ ఉంటాయి.

నారాయణిలో ఉగ్రమైన నరసింహాది ఉపాసనలు, సౌమ్య రూపాలు, గురు స్వరూపాలు ఉన్నాయి. దక్షిణామూర్తి మొదలైనవి యోగమూర్తులు; వీరభద్ర ఇత్యాది రూపాలు ఉగ్రమూర్తులు; పార్వతీ సమేతుడైన పరమేశ్వరుడు, నటరాజు మొదలైనవి భోగమూర్తులు.

ముగ్గురి అవసరమూ మనకు ఉంది. మూడూ జీవితానికి అవసరం కనుక మనం ఆరాధించే దైవం మన కోసం మూడు రకాల మూర్తులు ధరించి కాపాడతాడు. ఒక తల్లి పిల్లవాణ్ణి కాపాడడానికి ఎన్ని రకాల రూపాలు ధరిస్తుందో – వాడికి అన్నం పెట్టేటప్పుడు తల్లి అన్నపూర్ణ, చదువు నేర్పేటప్పుడు తల్లి రూపం సరస్వతి, పిల్లవాణ్ణి ఎవరైనా దెబ్బలాడడానికి వస్తే ఆ తల్లి ఉగ్రరూపం దాలుస్తుంది.

జగన్నిర్వహణ చేసే జగదంబిక ప్రసన్న స్వరూపిణిగా, ప్రసన్న వదనగా, సౌమ్య స్వరూపిణిగా ఎలా ప్రకాశిస్తున్నదో, అలాగే ఉగ్రరూపంతో చండిగా కనిపిస్తున్నది. చడి అనే ధాతువు నుండి చండి అనే శబ్దం వచ్చింది. తన పూర్తి ప్రతాపాన్ని బయటపెట్టిన స్వరూపం ప్రచండ. అంటే దాపరికం లేకుండా శక్తి అంతా బయట పెట్టింది. 'చండీ' శబ్దానికి మనం ధ్యానంతో అర్థం చెప్పగలిగితే పరిపూర్ణమైన పరబ్రహ్మ స్వరూపిణి అని అర్థం. అలాంటి ఆ చండి ఎందుకు అవతరించింది?

ఆ కథ చెప్తూ సుమేధ ఇలా అంటాడు: "దేవానాం కార్య సిద్ధ్యర్థం ఆవిర్భవతి సా యదా । ఉత్పన్నేతి తదా లోకే సా నిత్యాప్యభిధీయతే॥ (దేవీమాహాత్మ్యం–1.66) ఈ ఒక్క శ్లోకంలో అమ్మ తత్త్వమంతా చెప్పారు. సానిత్యా అంటే ఎప్పుడూ ఉండేది ఆ తల్లి అన్నారు. ఎప్పుడూ ఉన్న తల్లే కానీ అప్పుడప్పుడు అవతరిస్తుందట. సానిత్య అయిన జగదంబిక దేవకార్య సిద్ధ్యర్థం వచ్చిందట. ఇదే మాట లలితా సహస్రంలో చెప్పారు "దేవకార్య సముద్యతా" అని; అప్పుడూ దేవతల కార్యం కోసమే వచ్చింది. అమ్మ ఎప్పుడు వచ్చినా దేవకార్యం కోసమే వస్తుంది.

మహిషాసురుడు, శుంభనిశుంభులు, భండాసురుడు బాధ పెడితే అమ్మ అవతరించింది. మధుకైటభుల బాధతట్టుకోలేక బ్రహ్మదేముడు ప్రార్థన చేయగా అమ్మ మహాకాళికగా ఆవిర్భవించి అనుగ్రహించింది. "మీకు కష్టాలు వచ్చినప్పుడు భ్రామరీ, శతాక్షీ, రక్తదంతా అనే రూపాల్లో దేవకార్యం కోసం మళ్ళీవస్తాను" అని అమ్మ దేవతలకు అభయమిచ్చింది. ❖ **సశేషం**

నిస్వార్థ ప్రేమకు ప్రతీక!

మాతృపూజ ఒక విశిష్టమైన తత్త్వం. మనకు కలిగే భావాల్లో మొట్టమొదటి భావం 'శక్తి'ని గురించినది. అంతఃశక్తి ఆత్మ, బాహ్యశక్తి ప్రకృతి – ఈ రెండిటి మధ్య జరిగే యుద్ధమే మానవ జీవనం. మనకు తెలియనివీ, మనం అనుభవించేవీ... సర్వమూ ఈ రెండు శక్తుల ఫలమే. సూర్యుడు అల్పమైనవాటి మీదా, ఉన్నతమైన వాటి మీదా కూడా సరిసమానంగా ప్రకాశిస్తున్నట్లే, భగవంతుని ప్రేమ నిష్పక్షపాతురాలైన తల్లి లాంటిదనే భావం ఉదయించింది.

భారతీయ సంస్కృతిలో మాతృభావానికే ప్రాముఖ్యం ఇచ్చారు. తల్లి అన్ని అవస్థల్లోనూ బిడ్డకు అండగా ఉంటుంది. ఒక వ్యక్తిని భార్యాపుత్రులు విడువవచ్చేమో గానీ తల్లి ఎన్నడూ విడువదు. ఎందుకంటే ఆమె ప్రేమ సడలదు, కొరవడదు, తన శిశువులోని చెడును లక్ష్యపెట్టదు, పైగా మరింతగా అతణ్ణి ప్రేమిస్తుంది. తల్లి విశ్వం యొక్క నిష్పక్షపాత శక్తి. నేడు హైందవులలోని అగ్రవర్ణాలలో కాన వచ్చే పూజ మాతృపూజే. ఈ ఆదర్శం ఇంకా ప్రాచుర్యాన్ని సంతరించుకోలేదు.

ప్రపంచమంతా ఒకే తల్లి లీల. కానీ దీన్ని మనం విస్మరిస్తున్నాం. మనం స్వార్థం వీడినప్పుడు, సంతోషం కలుగుతుంది. ఈ తత్త్వాన్ని ప్రతిపాదించిన తాత్త్వికుడు, కంటికి కనిపించే ప్రతి విషయం వెనుకా ఒకే శక్తి ఉందనే భావాన్ని తెలుసుకొని ఆశ్చర్య పోయాడు. భగవంతుణ్ణి గురించిన భావనలో మానవ కల్పితమైన హద్దు మూర్తిమత్త్వం ఉంది.

తల్లిలోని నిరపేక్షమైన శాశ్వత ఆత్మార్పణమే మనకు శాంతిని ఇవ్వగలదు. నిర్భయంగా, నిర్వ్యాజంగా ఆమెను ఆమె కోసమే ప్రేమించు. నువ్వామె బిడ్డవు కాబట్టి ఆమెను ప్రేమించు. మంచీ చెడూ అన్నిటా ఆమెను సమానంగా చూడు. ఇలా ఆమెను తెలుసు కొన్నప్పుడే, కేవలం అప్పుడే శాశ్వతానందం కలుగుతుంది. అప్పటి వరకూ దుఃఖం మనల్ని వెన్నాడుతుంది. తల్లి వద్ద విశ్రాంతి తీసుకొంటేనే మనం సురక్షితంగా ఉంటాం. కాబట్టి నిస్వార్థ ప్రేమకు ప్రతీక అయిన మాతృమూర్తిని ఆరాధించాలి. ❖

పరిప్రశ్న

- స్వామి మేధానంద పురి

– సుబ్బారెడ్డి, కర్నూలు

? : ద్వాదశ నామాల్లోనూ, పూజల్లోనూ "కేశవ" నామాన్ని మొదట్లో ఎందుకు ఉచ్చరిస్తారు?

✍: "కశ్చ అశ్చ ఈశశ్చ త్రిమూర్తయః కేశాస్తే యద్వశేన వర్తన్తే స కేశవః". క+అ+ఈశ+వ – ఈ నాలుగు పదాల్నీ కలిపితే "కేశవ"అనే పదం ఉత్పన్నమవుతుంది. క=బ్రహ్మ, ఈశ=ఈశ్వరుడు, అ=విష్ణువు, వ=వశ అని అర్థం. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు వశమందుగలవాడు కేశవుడు. ఈ నామం యొక్క అర్థం అత్యంత విపులం, వ్యాపకం అవడం వల్ల ప్రప్రథమంగా దీనిని ఉచ్చరిస్తారు.

– సుశీల, కాకినాడ

? : దేవుడికి హారతి ఎందుకు ఇస్తాం? ఎందుకు ఆ హారతిని కళ్ళకు అద్దుకోవాలి?

✍: పరమాత్మ స్వయం ప్రకాశ స్వరూపుడు, జ్యోతి స్వరూపుడు. చీకటిలో మనం వస్తువులను చూడలేం. ప్రకాశం అంధకారాన్ని తొలగించి వస్తువులను కనిపించేలా చేస్తుంది. అలాగే అజ్ఞానంలో ఉన్నప్పుడు ఆ పరమాత్మ స్వరూపాన్ని చూడలేం. కాబట్టి జ్యోతి స్వరూపుడైన భగవంతుణ్ణి మనలోని అజ్ఞానాంధకారాలను తొలగించి, జ్ఞాన ప్రకాశాన్ని కలిగించాల్సిందిగా ప్రార్థిస్తూ ఆయనకు ఇచ్చిన హారతిని కళ్ళకు అద్దుకొంటాం. సూర్యునిలోనూ, పరమాత్మలోనూ, మన కళ్ళల్లోనూ ఉన్న జ్యోతి ఒక్కటే. "జాగ్రదవస్థలో కుడి కంటిలో ఆ పరమాత్మ స్థానం ఉంటుంది" అని శ్రుతులు చెబుతున్నాయి.

– ఇందిరమ్మ, మహబూబ్‌నగర్

? : పంచాక్షరీ మంత్రాన్ని తెలపండి? పురశ్చరణ కోసం ఆ మంత్రాన్ని ఎన్ని సార్లు జపించాలి?

✍: ఐదు అక్షరాలు ఉన్న మంత్రాన్ని పంచాక్షరీ మంత్రం అని అంటారు. "ఓం నమః శివాయ" – ఇది శివ పంచాక్షరీ మంత్రం. "ఓం రామాయ నమః" అనేది రామ పంచాక్షరీ మంత్రం. తారకం (ప్రణవం) చతుర్థి అంతం గల దేవతా శబ్దం. ప్రణవాన్ని అన్ని మంత్రాలకూ, స్తోత్రాలకూ ముందు తప్పక ఉచ్చరించాలి. లేకుంటే మంత్ర స్తుతులు ఫల శూన్యమవుతాయి. ఒక్కో అక్షరం లక్షసార్లు జపించడాన్ని 'పురశ్చరణ' అంటారు. పంచాక్షరీ మంత్రాన్ని 5 లక్షల మార్లూ, గాయత్రీ మంత్రాన్ని 24 లక్షల మార్లూ జపిస్తే పురశ్చరణ అవుతుంది.

– నరసింహారావు, విశాఖపట్నం

? : సన్న్యాసం అంటే ఏమిటి? ఎవరిని సన్న్యాసులంటారు?

✍: సంకల్ప త్యాగమే సన్న్యాసం. ఇచ్ఛ, కామనలను పూర్తిగా త్యజించిన వారిని సన్న్యాసులు అంటారు. గృహస్థాశ్రమంలో ఉండి సంకల్పాల్ని త్యజించిన వారు కూడా సన్న్యాసులే అవుతారు. కాషాయ వస్త్రాలు ధరించి, సంకల్పాలను త్యజించని వారు కేవలం సాధకులు మాత్రమే!

సంకల్పాల్ని త్యజించినవారే మోక్షానికి అర్హులు. శ్రవణ మననాదుల ద్వారా జ్ఞానం సంపాదించినవారు మోక్షాన్ని పొందగలుగుతారు. వేద విహిత కర్మలను నిష్కామ బుద్ధితో చేసి, చిత్తశుద్ధిని పొందిన వారు కూడా క్రమ ముక్తిని పొందుతారు. బాహ్య వస్తువుల చింతనను (పుత్ర–విత్త–లోకైషణాలను) త్యజించి, సర్వత్రా బ్రహ్మ దృష్టిని కలిగినవారే సన్న్యాసులు అవుతారు. గృహస్థులు నిష్కామ కర్మయోగం అనుసరించి సంకల్ప త్యాగం చేయవచ్చు. కాబట్టి ముఖ్య దృష్టితో సన్న్యాసులనూ, గౌణదృష్టితో గృహస్థులనూ ఏకీభవించి సన్న్యాస – కర్మ యోగాలు ఒకటే అని చెప్పడం జరిగింది.

యం సన్న్యాసమితి ప్రాహుఃయోగం తం విద్ధి పాండవ
న హ్యసన్న్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన *(గీత–6.2)*

'ఓ అర్జునా! దేనిని సన్న్యాసమని చెప్పుదురో, దానినే యోగం అని గ్రహింపుము. ఎందుకంటే సంకల్పరహితుడు ఎన్నటికీ యోగి కాలేడు.'

సంకల్పాలను త్యజించిన వారే సన్న్యాసులు, యోగులు. ❖

– రెంటాల జయదేవ

ఆరోగ్యం అందించే శంఖం

మహర్షుల మాట

మహర్షి పులస్త్యుడు 'పులస్త్య సంహిత'లో ఇలా చెప్పారు: "ఎవరైతే తమ ఇంట్లో లక్ష్మీదేవి శాశ్వతంగా నివాసం ఉండాలను కుంటారో, ఋణబాధలు, దరిద్రం లేకుండా సిరిసంపదలతో తులతూగాలనుకుంటారో అలాంటివాళ్ళు దక్షిణావర్త శ్వేత శంఖాన్ని (కుడి వైపు తెరుచుకొని ఉండే తెల్లటి శంఖాన్ని) పూజ గదిలో పెట్టుకోవాలి".

సుఖసంతోషాలు, సిరిసంపదలు, విజయం కావాలను కుంటే దక్షిణావర్తమైన తెల్లటి శంఖాన్ని మించినది ఏదీ లేదని 'లక్ష్మి సంహిత'లో బ్రహ్మర్షి విశ్వామిత్రుడు చెప్పారు. శంకరా చార్యులు సైతం దక్షిణావర్తమైన తెల్లటి శంఖం ఉన్నప్పటికీ, దాన్ని ఉపయోగించుకోనట్లయితే అంతకన్నా దుర దృష్టం మరొకటి ఉండదని పేర్కొన్నారు. ఆ శంఖం ఉన్నట్లయితే, అది మంచి పనులు చేయడానికి ప్రోత్సహిస్తుందని ఆయన తెలిపారు.

తాంత్రిక విధానంలో కూడా శంఖానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఆ విధానంలో వినియో గించడానికి దక్షిణావర్తమైన తెల్లటి శంఖాన్ని మించినది ఏదీ లేదని 'గోరక్ష సంహిత'లో గురు గోరఖ్‌నాథ్ చెప్పారు. ఆ వినియోగం వల్ల తానూ, తన అనుయాయులూ ఏ విధంగా విజయం సాధించినదీ వివరించారు.

లక్ష్మీ స్వరూపమైన దక్షిణావర్త శ్వేత శంఖాన్ని అన్ని సందర్భాల్లోనూ ప్రార్థించినట్లయితే సంపదనూ, సౌభాగ్యాలనూ అందిస్తుందని మార్కండేయ మహర్షి వివరించారు.

వైజ్ఞానిక వివరణలు

శంఖనాదం ప్రయోజనాల గురించి వైజ్ఞానికమైన వివరణలు కూడా ఉన్నాయి. ఆలయాల్లో చాలా మంది జనం గుమిగూడడం వల్ల గాలి కలుషితమవుతుంది. అలాంటప్పుడు పరిశుభ్రమైన గాలి కోసం శంఖనాదం ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తల పరిశోధనలు చెబుతున్నాయి. అలాగే, శంఖధ్వానం ఎంత దూరం వ్యాపిస్తే అంత దూరం ఆ వాతావరణంలోని వ్యాధికారక సూక్ష్మ క్రిములు, మైక్రో ఆర్గానిజమ్స్ ధ్వంసమవుతాయని కూడా భారత శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భారతీయ వైజ్ఞానికవేత్త జగదీశ్ చంద్రబోస్ ప్రయోగం చేసి, ఆ సంగతి నిరూపించారు. వాతావరణంలోని సూక్ష్మజీవులను నాశనం చేయడానికి ఎంతో సమర్థమైన, అతి చౌకయిన పద్ధతి శంఖారావం చేయడమేనని బెర్లిన్ విశ్వవిద్యాలయంలో జరిగిన పరిశోధనలు ధ్రువీకరించాయి.

ఆరోగ్యానికి శంఖారావం

కలరా, మలేరియా వ్యాధుల్ని నియంత్రించడంలో కూడా శంఖనాదం తోడ్పడుతుందని చెబుతున్నారు. అపస్మారం, మూర్ఛ రోగం, కుష్ఠు వ్యాధి పీడితులకు సైతం శంఖనాదం మేలు చేస్తుంది.

అలాగే, శంఖం ఊదడం వల్ల హృద్రోగం తగ్గిపోతుందనీ, నత్తి ఉన్నా తగ్గుతుందనీ అంటారు. శంఖాన్ని ఊదడం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. ఊపిరితిత్తులకు సంబంధించిన రుగ్మతల నుంచి రక్షణ పొందవచ్చు. మానసిక ఆందోళనను పోగొట్టుకోవడానికీ, రక్తపోటును క్రమబద్ధం చేసుకోవడానికీ, మధుమేహ వ్యాధిని నియంత్రించ డానికీ, శ్వాస, జీర్ణకోశ సంబంధ మైన వ్యాధులను నివారించడానికీ శంఖం ఊదడం ఉపకరిస్తుంది.

శంఖంతో అల్లుకున్న నమ్మకాలు

'శంఖ్ బాజే, భూత్ భాగే' అని మన దేశంలో ఓ మాట ఉంది. 'శంఖం ఊదితే, దయ్యాలు పారిపోతాయి' అని దాని అర్థం. చిన్న చిన్న శంఖాలను మాలగా కట్టి, చిన్న పిల్లల మెడలో వేసే ఆచారం కూడా కొన్ని చోట్ల ఉంది. దీనివల్ల పిల్లలకు త్వరగా మాటలు వస్తాయనీ, మాట స్పష్టంగా ఉంటుందనీ ఓ నమ్మకం. కొన్ని ప్రాంతాల్లో మహిళలు చిన్న చిన్న శంఖాలతో తయారు చేసిన గాజులు ధరిస్తారు.

ప్రార్థనా స్థలంలో శంఖాన్ని నీటితో నింపి, అక్కడే ఉంచడం ఆనవాయితీ. తరువాత ఆ నీటిని భక్తుల మీద జల్లుతారు. ఆ మంత్ర జలానికి రోగ నాశక లక్షణాలుంటాయనీ, ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందనీ హిందువుల నమ్మకం. మొత్తం మీద హిందూ సంస్కృతి, ఆచారాల్లో శంఖానికి ఉన్న ఈ ప్రత్యేక స్థానాన్ని తెలుసుకొని, పదిమందికీ తెలియజెప్పడం మంచిది. ❖

(వచ్చే సంచిక నుంచి 'నారికేళ విశిష్టత')

నిరుపేదల సేవలో తరించిన తరుణి

మూలం: వీరరాఘవన్ చిత్రాలు: శంకర్ అనుసృజన: స్వామి జ్ఞానదానంద

పూంపుహార్ పట్టణంలో మాధవి అనే నర్తకి, తన కుమార్తె మణిమేఖలతో నివసించేది.
మణిమేఖల తండ్రి కోవలన్, పాండ్యరాజు ఇచ్చిన తప్పుడు తీర్పుకి బలైపోయాడు.
ఆ శోకంలో వారిద్దరూ బౌద్ధ మతాన్ని స్వీకరించి, తపోమయ జీవితం గడపసాగారు.









5
మేఖలా! ఈ మూడు మంత్రాలూ స్వీకరించు. ఇందువల్ల నువ్వు అనుకున్న రూపం పొందగలవు, ఆకలి లేకుండా జీవించగలవు, ఆకాశ మార్గంలో పయనించగలవు.
చిత్తం దేవీ!
6
మణిమేఖలాదేవి అంతర్థానమయ్యాక మరో దేవత అక్కడ ప్రత్యక్షమైంది.
మేఖలా! రానున్న పౌర్ణమి నాడు గోముఖి అనే నీటి ఊటను తవ్వగా తవ్వగా 'అమృత సురభి' అనే అక్షయ పాత్ర బయటకు వస్తుంది. ప్రజల ఆకలి తీర్చడానికి దాన్ని ఉపయోగించు.
అమృత సురభిని తీసుకొని మణిమేఖల పూంపుహార్‌కు వచ్చి, తాను కనిపించకపోవడంతో దిగులుపడుతున్న తన తల్లి మాధవికి జరిగింది పూసగుచ్చినట్లు చెప్పింది.
7
పూంపుహార్ పట్టణంలో ఆకలితో అలమటించే వారి ఆకలి తీర్చాలనుకున్నది మణిమేఖల. అప్పుడు కాయచండిక అనే స్త్రీ తీరని క్షుద్బాధతో కృశించి వచ్చింది. ఆమె మణిమేఖల వద్ద కొచ్చి...
8
తల్లీ! మీ అమృత సురభిలో, ఆధీర అనే పతివ్రత నుంచి మొదటి భిక్ష స్వీకరించి, మీ కార్యాన్ని ప్రారంభిస్తే దాన్లో అన్నం తరగకుండా అక్షయంగా వస్తుంది.
అలాగే చేస్తానమ్మా!
ఆ విధంగానే ఆధీర నుంచి అమృత సురభిలో భిక్ష గైకొని కాయచండిక క్షుద్బాధను తీర్చింది మణిమేఖల.

మిగతా 36వ పేజీలో...

కుమారీ పూజ ప్రాముఖ్యం

- డాక్టర్ అపర్ణ

దేవీ భాగవతంలో జనమేజయ మహారాజు వేద వ్యాసుల వారిని దుర్గాపూజా విధానం అడిగినట్లు ఉంది. దుర్గామాత అర్చనా విధానాన్ని వివరిస్తూ వ్యాసమహర్షి 'కుమారీ పూజ'కు ఉన్న ప్రాధాన్యాన్ని తెలియజేశారట. ఆశ్వయుజ శుక్ల పాడ్యమి నుంచి నవమి వరకూ రోజూ అమ్మవారి పూజ పూర్తి చేసి, ఒక బాలికను సాక్షాత్తూ జగజ్జననిగా భావిస్తూ నివేదనతో సహా యథావిధిగా పూజ చెయ్యాలి. ఈ కుమారీ పూజ చాలా రకాలుగా చేస్తారు. ఉదాహరణకు మొదటిరోజు ఒక బాలికతో మొదలుపెట్టి, ఏ రోజుకారోజు బాలికల సంఖ్యను పెంచుతూ, నవమి నాడు తొమ్మిది మంది బాలికలను పూజించడం ఒక పద్ధతి. పాడ్యమి నుంచి నవమి వరకూ రోజూ తొమ్మిది మంది బాలికలను పూజించడం మరొక పద్ధతి.

కుమారీ పూజ ప్రాముఖ్యం : కుమారీ పూజ ఎందుకు చేస్తారు? నిష్కపటులైన పసిపిల్లలలో పవిత్రత మూర్తీభవించి ఉంటుంది. బాలికను అర్చిస్తే సాక్షాత్తూ అమ్మవారిని అర్చించినట్లే! శ్రీరామకృష్ణులు "మీరు కుమారీ పూజ చెయ్యలేదా? ఒక మామూలు అమ్మాయి (బాలిక)ని అర్చించడం ఎందుకు అనుకుంటున్నారా? ఎందుకంటే ఆమె జగన్మాత ప్రతిరూపం" అనేవారు. శాస్త్రాలు కూడా అమ్మవారి ఆరాధనలో కుమారీ పూజకు చాలా ప్రాముఖ్యం ఉందని చెబుతున్నాయి.

వైదిక, తాంత్రిక, పౌరాణిక శాఖల సంగమమే దుర్గాపూజ అని విద్వాంసుల అభిప్రాయం. భారతదేశంలో శక్తి ఆరాధన అనాదిగా ఉన్నదే అయినా దుర్గా పూజ సమయంలో పసి పాపను ఆరాధించడం అనేది తంత్రాలు ప్రారంభించాయని కొందరు విద్వాంసుల అభిప్రాయం. దుర్గామాత వేదకాలం నాటి దేవత కనుక ఆమెను సజీవంగా బాలిక రూపంలో ఆరాధించడం అన్నది కూడా అనాదిగా ఉన్నదే అని మరి కొందరి అభిప్రాయం.

వేదకాలంలో యజ్ఞం చేస్తున్నప్పుడు అగ్నిని "కుమార" అనీ, మంటని "కుమారి" అనీ అనేవారు. తైత్తిరీయ ఆరణ్యకంలో "కాత్యాయనాయ విద్మహే, కన్యకుమారి ధీమహి, తన్నో దుర్గిః ప్రచోదయాత్" అనే దుర్గా గాయత్రీ మంత్రంలో అమ్మవారిని కన్యాకుమారి అన్నారు. ఒక విశిష్టమైన పవిత్ర అగ్ని - దుర్గ-ఈ మంత్రాధి దేవత. దుర్గను కాత్యాయన (వేదాల ప్రత్యేకత) అన్నారు; దానికి కారణం ఆమె ఒక అవతారంలో కాత్యాయనుని పుత్రిక. ఇక్కడ 'దుర్గ' అన్న పదం 'దుర్గి'గా మారింది. అయితే 'కుమారి' అనే పదానికి చాలా ప్రాముఖ్యం ఉంది.

కుమారి అంటే "కు కుత్సితమ్ మారయతి ఇతి కుమారీ" - చెడును నశింప చేసేది కుమారి. వేదాల ప్రకారం దుర్గను బాలికతో పోల్చారు. శ్వేతాశ్వతర ఉపనిషత్తులో దేవీ గురించి "త్వమ్ స్త్రీ త్వమ్ పుమానసి త్వమ్ కుమారా ఉతవా కుమారీ" - నువ్వొక స్త్రీవీ, నువ్వే పురుషుడివీ; అలాగే నువ్వు ఒక బాలుడివీ, నువ్వే బాలికవీ" అని చెప్పబడింది.

"ఒకప్పుడు అంభృణ మహర్షి కుమార్తెగా జగన్మాత అవతరించింది; అప్పుడు ఆమె పేరు వాక్. తానూ పరాశక్తి ఒకటే, వేరు కాదు అని తెలిసిన ఆమె 'ప్రజలకు శివత్వాన్నీ, బ్రహ్మత్వాన్నీ, విష్ణుత్వాన్నీ అనుగ్రహించేది నేనే' అని (ఋగ్వేదంలోని పదవ మండలంలో) చెబుతుంది"

యోగీశ్ చంద్ర అనే వంగ విద్వాంసుడు "దుర్గ ఒక కన్య; ఆమె శివపత్నీ కాదు, కార్తికేయ వినాయకుల జననీ కాదు. ఈ కుమారినే మన పురాణాలు ఆద్యాశక్తి అనీ, ప్రకృతి అనీ అన్నాయి. ఆమె శాశ్వతమైనది, ఆమెకి పుట్టుక అనేదే లేదు. అన్నింటికీ ఆమెయే మూలకారణం" అని వివరించాడు.

దేవాసుర సంగ్రామంలో విజయులైన దేవతలకు గర్వం రావడం, వారి అహంకారాన్ని తొలగించడానికి బ్రహ్మ

వారిని పరీక్షించడం, ఇంద్రుడి ఎదుట ఉమ అనే పేరుతో చిన్న బాలిక రూపంలో జగన్మాత ప్రత్యక్షమై అతనికి జ్ఞానోపదేశం చెయ్యడం మొదలైన వివరాలతో కేనోపనిషత్తులో ఉన్న కథ అందరికీ తెలుసు. పురాణాలు కూడా జగన్మాతను కుమారీ అని వర్ణిస్తున్నాయి. "బ్రహ్మ ఇతర దేవతలతో కలసి అమ్మవారిని మేలుకొలిపి, రావణ సంహారం జరిపించాల్సిందిగా ప్రార్థించాడట. ఆ జగదంబిక వారి ఎదుట కుమారీ రూపంలో ప్రత్యక్షమై బిల్వవృక్షం మీద ఉన్న తనను మేలుకొలపమని చెప్పిందట. వారంతా భూమి మీదకు రాగా బిల్వవృక్షం మీద ఉజ్జ్వలకాంతితో మిరుమిట్లు గొలిపే బాలిక నిద్రిస్తూ గోచరించిందట. అందరూ స్తుతించగా బాలిక ఆనందించి బాలికా రూపాన్ని వదిలి ఉగ్రచండీ రూపాన్ని ధరించిందట. ఆమే చండిక, ఆమె అనుగ్రహించిన పరాక్రమం వల్ల

రాముడు రావణుణ్ణి సంహరించాడు" అని బృహద్ధర్మ పురాణంలో ఒక కథ ఉంది. మహాభారతంలోని భీష్మ పర్వంలో అర్జునుడు సాక్షాత్తూ కుమారీ పూజ చేసినట్లు ఉంది.

తంత్రాలు కుమారీని గొప్ప యోగినిగా వర్ణించాయి. పార్వతి, శివుడితో "కుమారికా హ్యహమ్ నాథా సదా త్వం చ కుమారికా" – 'ప్రభూ! నేను కుమారీని, మీరు కూడా కుమారీయే' అన్నదని తంత్రాలలో చెప్పారు. శక్తి లీల స్థూల ప్రపంచంలోనూ, సూక్ష్మ ప్రపంచంలోనూ ఒకే విధంగా ఉంటుందని తంత్రాలు చెబుతున్నాయి. ఈ పరాశక్తియే కుమారీ రూపంలో విశ్వసృష్టి గావిస్తుంది. ఆమె అన్నిటికీ మూలంగా అన్నింటిలోనూ అంతర్గతంగా నిలిచి ఉంటుంది. అలా తంత్రాలు పరాశక్తి పూజ పవిత్రమైన జీవికి (బాలిక) చెయ్యమని ఆదేశిస్తున్నాయి. అదే కుమారీ పూజ". కుమారీ పూజ లేని ఆరాధన, హోమం లాంటి వాటికి ఫలితం ఉండదు అని తంత్రాలు చెబుతున్నాయి.

కామరూప్‌లోని కామాఖ్య గుడిలోనూ, మదురైలోని మీనాక్షి ఆలయంలోనూ, కన్యాకుమారి ఆలయంలోనూ అమ్మ కుమారీగా ఆరాధితమవుతోంది. స్వామి వివేకానందులు చాలా సార్లు కుమారీ పూజ చేశారు. దివ్యజనని శ్రీశారదాదేవి దుర్గాపూజ సమయంలో మహాష్టమి నాడు కుమారీ పూజ చేశారని ప్రత్యక్ష సాక్షి ఇందుబాలా ఘోష్ చెప్పారు.

దేవీ పురాణం ప్రకారం దుర్గాదేవి వయో భేదాన్ని బట్టి వివిధ రూపాలలో – వేర్వేరు పేర్లతో కుమారీగా పూజలందుకుంటుంది. ఒకటి నుంచి పది సంవత్సరాల వయస్సుగల కుమారీలను పూజించినప్పుడు దుర్గాదేవిని ఈ నామాలతో పిలుస్తారు :

ఒక సంవత్సరం వయస్సున్న కుమారీ – **సంధ్యా**
రెండు సంవత్సరాల వయస్సున్న కుమారీ – **సరస్వతీ**
మూడు సంవత్సరాల వయస్సు గల కుమారీ – **త్రిధా**
నాలుగు సంవత్సరాల వయస్సు గల కుమారీ – **కాళికా**
ఐదు సంవత్సరాల వయస్సు గల కుమారీ – **సుభగా**
ఆరు సంవత్సరాల వయస్సు గల కుమారీ – **కుబ్జికా**
ఏడు సంవత్సరాల వయస్సు గల కుమారీ – **చండికా**
ఎనిమిది సంవత్సరాల వయస్సు గల కుమారీ– **శాంభవీ**
తొమ్మిది సం॥ వయస్సు గల కుమారీ– **కాలసందర్భా**
పది సంవత్సరాల వయస్సు గల కుమారీ – **అపరాజితా**

వయస్సును బట్టి ఆరాధనా ఫలం మారుతుంది. ఉదాహరణకు, రెండేళ్ళ వయస్సున్న కుమారీని పూజిస్తే కష్టాలు, దారిద్ర్యం తొలుగుతాయి. మూడేళ్ళ కుమారీ పూజ వల్ల స్వర్గప్రాప్తి, ఆయుఃప్రమాణం పెరగడం.

అందరూ కుమారీలో జగన్మాతను పూజించాలి. ఈ ఆధునిక యుగంలో మనలో అంతర్గతంగా ఉన్న శత్రువులను సంహరించడానికీ, ఆధ్యాత్మిక అపేక్ష జాగృతమవడానికీ మాతృశక్తిని ఆరాధించాలి. ఇది కుమారీ పూజ ద్వారా సాధ్యమవుతుంది. ❖

ఓ మహాత్యాగి ఆత్మకథ

(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

(...గత సంచిక తరువాయి)

(మహా భక్తుడు, అద్వైత వేదాంతి, కర్మయోగి, ప్రవక్త, శ్రేష్ఠసన్యాసి, గురువు, యుగాచార్యుడు, దేవదూత, పరమహంస శిష్యుడు, మానవ జాతి ప్రేమికుడు, మహా దేశభక్తుడు, ధ్యానసిద్ధుడు, మహాయోగి, గంధర్వ గాయకుడు ఇలా విభిన్న రూపాలలో స్వామి వివేకానంద మనకు దర్శనమిస్తారు. స్వామీజీ సంభాషణలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, లేఖల్లో స్వయంగా తెలిపిన తన జీవితానుభవాలను ధారావాహికంగా 2009 జూన్ సంచిక నుంచి అందిస్తున్నాం.)

నేను మూడోసారి మళ్ళీ దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులను కలిశాను. అప్పుడాయన భావ సమాధి గతులై, నన్ను దేవుడని పొగిడారు. "హే ప్రభూ! నారాయణా! నా కోసమే నీవీ మానవ రూపంలో వచ్చావు. అమ్మా! కామినీ కాంచనాల గంధం కూడా లేని అసలైన భక్తుల సాంగత్యం లభించకుంటే, ఈ భువిపై ఎలా మనగలను?" అని నేను జగన్మాతనడిగాను. "నిన్న రాత్రి నువ్వు నా వద్దకు వచ్చి, నన్ను లేపి 'నేను వచ్చాను' అన్నావు" అన్నారు. కానీ నాకేమీ తెలీదు. నేను కలకత్తాలో మా ఇంట్లో బాగా నిద్రపోయాను.

మరోసారి చాలా దూరం నుంచి కాలినడకన దక్షిణేశ్వరం కాళికాలయం చేరుకుని నేరుగా శ్రీరామకృష్ణుల గదిలోకి వెళ్ళాను. ఆయన ఓ చిన్న మంచంపైన కూర్చున్నారు. పరమానందభరితులై, ఆప్యాయంగా నన్ను తన దగ్గరకు పిలిచి మంచం మీద తన పక్కన కూర్చోబెట్టుకున్నారు. మరుక్షణమే ఓ రకమైన భావ పరవశానికి లోనై తనలో తాను ఏదో గొణుగుతూ, దృష్టి నా పైనే నిలిపి, మెల్లగా నా దగ్గరకు రాసాగారు. వెనుకటిలాగే ఈ రోజు ఏదో (వి)చిత్రం చేయబోతున్నారనుకున్నాను. కానీ క్షణకాలంలో ఆయన తన కుడిపాదాన్ని నాపై ఉంచారు! ఆ స్పర్శ తక్షణమే నాలో ఓ మహాద్భుతమైన అనుభూతిని రేపింది! నేను కళ్ళు తెరచి చూస్తుండగానే గోడలు, గదిలోని వస్తువులతో సహా అన్నీ తీవ్రమైన వేగంతో తిరుగుతూ శూన్యంలోకి మాయ మయ్యాయి. ప్రపంచమంతా నా అస్తిత్వంతో పాటు ఓ సర్వవ్యాపక మహాశూన్యంలో విలీనమైపోతున్న భావన. నా ఉనికినే కోల్పోతున్నందు వల్ల ఇక మృత్యుముఖంలో ఉన్నానని చాలా భయపడ్డాను.

నన్ను నేను నిగ్రహించుకోలేక "మీరు నాకేం చేస్తున్నారు? నాకు ఇంట్లో తల్లితండ్రులున్నారు" అంటూ అరిచాను. ఆయన గట్టిగా నవ్వి, నా ఛాతీని తడుముతూ "సరే, సరే! ఇప్పటికి ఇది చాలులే! సమయం వస్తే సర్వం సిద్ధిస్తుంది" అన్నారు. ఆశ్చర్యం! ఈ మాటలన్న వెంటనే నాకు కలిగిన విచిత్రమైన అనుభూతి అంతా మాయమైపోయింది! నేను మామూలు స్థితి కొచ్చాను; గది లోపలా బయటా అంతా మునుపటి లాగే కనిపించింది!

ఇదంతా నేను వర్ణించిన దాని కన్నా తక్కువ సమయంలో గడిచిపోయింది! కానీ నా మనస్సులో మాత్రం విప్లవాత్మకమైన మార్పు సంభవించింది. 'ఇదేమై ఉంటుంది?' అని ఆశ్చర్యంతో నిర్ఘాంతపోయాను. ఈ అద్భుత వ్యక్తి ఇచ్ఛామాత్రంతో ఈ మహానుభూతి వచ్చింది, వెళ్ళింది! ఇదేమైనా ఇంద్రజాలమా లేదా కనికట్టా? అని ప్రశ్నించు కున్నాను. కానీ అలా అవడానికి అవకాశం లేదు. ఎందుకంటే, అలాంటివన్నీ దుర్బల మనస్కుల మీదే పనిచేస్తాయి. నా మనస్సు, సంకల్పశక్తి చాలా బలమైనవని నాకు అమితమైన గర్వం ఉంది. నేనింకా ఈయన మహోన్నత వ్యక్తిత్వం ముందు తలవంచ లేదు; సరి కదా ఆయనను ఓ పిచ్చివానిలా భావించాను. మరి ఈ అకస్మాత్ మార్పుకి కారణమేమిటి? నేను ఏ నిర్ణయానికీ రాలేకపోయాను. అదో అనూహ్య విషయమనీ, దాన్ని గురించి ఆలోచించకపోవడమే మంచిదనీ అనిపించింది. ఏది ఏమైనా మరోసారి ఆయన నాపై మళ్ళీ అలాంటి ప్రభావం చూపకుండా జాగ్రత్తగా ఉండాలని గట్టిగా నిర్ణయించుకున్నాను.

మరుక్షణమే "నా లాంటి దృఢ మనస్కుణ్ణే ముక్కలు ముక్కలు చేసిన మనిషిని పిచ్చివాడని ఎలా తీసిపారేయ

గలం?" అన్న ప్రశ్న తలెత్తింది. కానీ మా మొదటి సమావేశంలో ఆయన తీరు చూస్తే అలా అనుకోక తప్పదు మరి, ఆయన ఓ అవతార పురుషుడై ఉంటే తప్ప! అదీ అసంభవమే! నాకు కలిగిన అనుభూతి స్వభావమేమిటో, పసిబాలునిలా ఎంతో పవిత్రంగా, సరళంగా ఉండే ఈ అద్భుత వ్యక్తి నిజతత్త్వమేమిటో తెలుసుకోలేక సతమతమయ్యాను. నా విమర్శనాత్మక బుద్ధికి ఇదొక పెద్ద దెబ్బలా తగిలింది. కానీ ఈ రహస్యపు లోతు కనుక్కొని తీరాలని సంకల్పించాను. ఆ రోజంతా ఇలాంటి ఆలోచనలతో గడిచింది. కానీ ఆ సంఘటన తరువాత ఆయన పూర్తిగా మరోమనిషి అయ్యారు. నన్ను ఎంతో ప్రేమ ఆప్యాయతలతో చిరపరిచిత మిత్రుడో

లేదా బంధువో అన్నట్లు ఆదరించారు. ఎంత ఆప్యాయత కురిపించినా ఆయనకు తృప్తి కలిగినట్లు లేదు. ఈ దివ్యమైన ప్రేమ, ఆప్యాయతలు నన్ను ఆయనకు మరింత దగ్గర చేశాయి. రాత్రి అవుతుండగా ఇక ఇంటికి వెళతానన్నాను. ఆయన చాలా అసంతృప్తితో మళ్ళీ త్వరలో వస్తానని మాటిచ్చిన తర్వాతే అనుమతించారు.

ఓ రోజు కాళికాలయ ఉద్యానంలో శ్రీరామకృష్ణులు నా హృదయస్థానంలో తాకారు. మొదట ఇళ్ళు, గదులు, తలుపులు, కిటికీలు, వరండాలు, చెట్లు, సూర్యచంద్రులు అన్నీ ముక్కలు చెక్కలవుతూ అణువులు, పరమాణువులుగా మారి మహాకాశంలో విలీనమై పోతున్నాయి. మెల్లగా ఆకాశంతో పాటు 'నేను' అనే స్ఫురణ (అహం చేతన) కూడా మాయమైపోయింది. ఆ తరువాత ఏమైందో నాకు గుర్తు లేదు. మొదట భయపడ్డాను. ఆ స్థితి నుండి దిగి వచ్చి, మళ్ళీ ఇళ్ళు, వాకిళ్ళు, కిటికీలు, వరండాలు మొదలైనవన్నీ చూడగలిగాను. మరో సందర్భంలో అమెరికాలోని ఒక సరస్సు ఒడ్డున సరిగ్గా ఇలాంటి అనుభూతే కలిగింది.

దీన్ని మతి భ్రమ అంటారా? ఈ అనుభూతి ఏదైనా రోగం ముదిరినందు వల్లా, లేక మత్తు పానీయాల నిషా వల్లా, లేక చిత్రవిచిత్ర శ్వాస ప్రక్రియలతో పుట్టిన భ్రమల వల్లా కాక, సంపూర్ణ ఆరోగ్యవంతుడైన ఒక మనిషికి కలిగినప్పుడు దీన్ని 'మతి భ్రమ' అని ఎలా అంటాం? ఇంకో విషయం, ఈ అనుభూతి వేదాలలో చెప్పిన దానితో సరిపోతోంది. పూర్వ కాల ఋషులు, ఆచార్యులు సాక్షాత్కారం గురించి చెప్పిన వివరాలతో ఇవి సరిపోతున్నాయి. ఆఖరికి నన్నో మతి తప్పిన వెర్రివెంగళప్పలా లెక్క వేశారా? ఈ అద్వైతానుభూతినే శాస్త్రాలు బ్రహ్మసాక్షాత్కారమనీ, దీనితో సకల భయాలు, జనన మరణ సంసార బంధాలు విచ్ఛేదనం అవుతాయనీ వచిస్తున్నాయి. ఈ మహోన్నత బ్రహ్మానందాన్ని అనుభవించిన వ్యక్తి ప్రాపంచిక సుఖదుఃఖాలకు చలించడు.

గురుదేవులు నన్ను అమితంగా ప్రేమించడం చూసి, నాపై గుడ్డి ప్రేమ చూపవద్దని నేను కొన్నిసార్లు ఆయనను చీవాట్లు పెట్టకపోలేదు. నా గురించే ఎప్పుడూ ఆలోచిస్తే, పురాణాలలో చెప్పినట్లు భరతుడు తన పెంపుడు జింకపై గల విపరీతమైన మమకారం వల్ల చనిపోయేటప్పుడు కూడా ఆ జింక గురించే చింతిస్తూ, మరుజన్మలో జింకగా పుట్టినట్లు మీరు కూడా నాలానే అవుతారని హెచ్చరించాను. సరళ స్వభావులైన గురుదేవులు ఈ మాటలతో ఎంతో కలత చెంది "నీవన్నది నిజమే! నిన్ను విడిచి ఉండలేకపోతున్నానే, నాకేమవుతుంది?" అంటూ ఆందోళనతో కాళికాలయంలోకి వెళ్ళారు. కొన్ని నిమిషాల్లో తిరిగి వచ్చి, "ధూర్తుడా! నీ మాటలిక ఎన్నడూ వినను. నీలో భగవంతుణ్ణి చూస్తున్నాను. కాబట్టే నిన్ను అంతగా ప్రేమిస్తున్నాననీ, ఏనాడైనా అలా దేవుణ్ణి చూడని పక్షంలో నీ ముఖం కూడా చూడలేననీ అమ్మ నాతో చెప్పింది" అన్నారు. ఈ ఘాటైన జవాబుతో నా వాదనలన్నిటినీ కొట్టిపారేశారాయన. ❖ *(సశేషం)*

అనుసృజన : స్వామి అర్చనానంద

ఉపాధ్యాయ వృత్తి– మానవతా విలువలు

– డాక్టర్ కమల ఎస్. జయరావు

ఇటీవల ఢిల్లీ మహానగరంలో ఇద్దరు విద్యార్థినుల మృతి గురించి రెండు దిగ్భ్రాంతికరమైన వార్తలు రావడం జరిగింది. ప్రపంచంలోనూ, మన దేశంలోనూ ఎన్నో సంచలనాత్మక సంఘటనలు జరుగుతుండడం మూలంగా మనం వీటిని త్వరలోనే మరచిపోతాం. వీటిని గురించి లోతుగా ఆలోచించం.

ఢిల్లీలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు పాఠం సరిగ్గా అప్పచెప్పలేదని ఆగ్రహం చెందిన ఉపాధ్యాయిని షన్నో అనే 10, 11 ఏళ్ళ బాలికకు దారుణమైన దండన విధించింది. ఆ పిల్లను వేసవిలో మండుటెండలో గొంతుకు కూర్చోబెట్టి, రెండు చేతులను తొడల కింద నుండి పైకి తెచ్చి చెవులు పట్టుకోమంది. (దీనిని కోడిపుంజు ఆసనం అంటారట) ఆ పైన వీపు మీద మూడు, నాలుగు ఇటుకలు పెట్టి– అలా రెండు గంటల పాటు కూర్చోబెట్టింది. ఇంటికి తిరిగి వెళ్ళిన బాలిక, బహుశా ఎండదెబ్బ మూలంగా కోమాలోకి వెళ్ళి, ప్రాణాలు విడిచింది.

రెండో సంఘటన సంపన్నులు, ఎగువ మధ్య తరగతివారి సంతానం చదువుకొనే ఒక 'ప్రతిష్ఠాత్మకమైన' పాఠశాలలో జరిగింది. పన్నెండో తరగతి విద్యార్థిని అయిన ఆకృతి ఉబ్బసం వ్యాధితో బాధపడేది. ఆనాడు తరగతి గదిలో ఉండగా ఉబ్బసం ఉద్ధృతంగా వచ్చింది. పాఠశాల యాజమాన్యం ఆమెకు ప్రాథమిక చికిత్స చేయలేదు, వైద్యుల్ని పిలిపించలేదు. ఆసుపత్రికి తరలించలేదు. తల్లితండ్రులను రమ్మని ఫోను చేసి, చేతులు దులుపుకొన్నారు. వారు వచ్చి ఆమెను తీసుకొని వెళుతుండగా, ఆ విద్యార్థిని మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచింది.

రెండు సందర్భాలలోనూ విద్యార్థినుల మృతికి కారకులైన వారు మహిళలే కావడం గమనార్హం, శోచనీయం. పిల్లలను శారీరకంగా, మానసికంగా హింసించడం నేరమని ప్రభుత్వం అంటున్నా దాన్ని పట్టించుకొనేవారే లేరు. ప్రభుత్వం సైతం ఒక నియమం ఏర్పరిచి, ఆ పై నిమ్మకు నీరెత్తినట్లు ఉంటోంది. పిల్లలను శిక్షించనిదే వారికి క్రమశిక్షణ అలవడదనే 'తప్పుడు అభిప్రాయం' ఉపాధ్యాయులలోనే కాక, తల్లితండ్రులలోను, అసలు సమాజంలోనే వేళ్ళూనుకొని ఉంది. పోతే నేటి ఉపాధ్యాయులకు ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి మార్గాలున్నాయి. వారి శిక్షణలో బాలల మనస్తత్త్వ శాస్త్రం కూడా ఒక పాఠ్యాంశం. అయినా, పైన పేర్కొన్న లాంటి సంఘటనలు దేశంలో ఏదో ఒక మూల జరుగుతూనే ఉన్నాయి. వీటికి కారణాలు అనేకం.

ఉపాధ్యాయులలో ఉన్నత విలువలు, ప్రేమ కొరవడుతున్నాయనడానికి ఇవి నిదర్శనాలు. ఇవి సమాజంలో నెలకొన్న విలువల లేమి, ప్రేమరాహిత్యాల చిహ్నాలు. పిల్లలు ఏ విద్య, ఏ వృత్తి ఎంచుకొనాలనే స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు మా తరానికి ఉండేవి. తల్లితండ్రులు తగిన సూచనలు, దిశానిర్దేశం చేసేవారు. ప్రతి పిల్ల, పిల్లవాడు ఇంజనీరో, డాక్టరో కావాలని నేటి తల్లితండ్రులు వారికి ఉగ్గుపాలతో (విటమిను చుక్కలనాలేమో) నూరి పోస్తున్నారు. అవి కాకపోతే ఎం.బి.ఏ, లేదంటే సి.ఏ. చదువును ఎంచుకోవాలి. ఇలాంటి పరిస్థితులలో ఉపాధ్యాయవృత్తి పట్ల తల్లితండ్రులకూ, సమాజానికీ గౌరవం లేకుండా పోతోంది.

నేటి ఉపాధ్యాయులు ప్రధానంగా మూడు కోవలకు చెందినవారై ఉంటున్నారు. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోలేక ఏదో ఒక పట్టా పుచ్చుకొని, ఈ వృత్తిలోకి వచ్చేవారు; వీరికి సర్వసాధారణంగా తల్లితండ్రులు, బంధువర్గాల ప్రోత్సాహం లభించదు. రెండో వర్గం ఆర్థిక సామాజిక పరిస్థితుల కారణంగా ఉన్నత వృత్తి విద్యలు అభ్యసించలేని వారు; వీరిలో చాలామటుకు వృత్తి పట్ల నిబద్ధత కలిగి ఉండడం కనపడుతుంది. మూడోది కాలక్షేపం కోసమో, సొంత ఖర్చులకు అవసరమైన ధనసంపాదన కోసమో ఈ వృత్తిని చేపట్టే గృహిణులు; వీరికి అంకిత భావం ఉంటుందా అన్నది అనుమానాస్పదమే.

ఇన్ని కారణాల వల్ల ఉపాధ్యాయుల పట్ల సమాజంలో పెద్దగా గౌరవం లేకుండా పోతోంది. నేడు ఉపాధ్యాయుల వేతనాలు తక్కువేమీ కాదు. పోతే పైన చెప్పిన కారణాల

మూలంగా 'బతకలేక బడిపంతులు' అన్న నానుడి నిజమవుతుంది. 'గురురేవ పరబ్రహ్మ' అనే సమాజంలో వీరికి సముచిత గౌరవం లభించకపోవడం ఒక శోచనీయమైన వైపరీత్యం. తల్లితండ్రులు తమ పిల్లల ఎదుటే - బడిలో బోధన బాగా లేదనీ, ఉపాధ్యాయుల పరిజ్ఞానం అంతంత మాత్రమేననీ కించపరచే వ్యాఖ్యలు చేస్తుంటారు. మంచి బోధనకు కొలమానం ఏమిటి? పిల్లలకు పరీక్షల్లో మంచి మార్కులు వచ్చి, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవడమే! ఈ ఒత్తిడి ప్రైవేటు పాఠశాలల్లోని ఉపాధ్యాయులపై తీవ్రంగా ఉంటుంది. వీరి ఉత్తీర్ణతా శాతం చూసి, ప్రభుత్వం కూడా తమ పాఠశాలల సిబ్బందిపై ఇలాంటి ఒత్తిడి తెస్తున్నారు.

ఇంతేకాక అల్పాదాయ వర్గాల వారూ, దిగువ మధ్యతరగతి వారి పిల్లలూ చదివే పాఠశాలల్లో ప్రతి తరగతి గదిలో విద్యార్థుల సంఖ్య హెచ్చుగా ఉంటోంది. పిల్లలందరికీ తెలివి, అవగాహనా శక్తి ఒకే స్థాయిలో ఉండవు. ఇంత మందికి తగినట్లు బోధించడం, వారికి క్రమశిక్షణ నేర్పడం ఉపాధ్యాయులకు తలకు మించిన భారం. ఇన్ని ఒత్తిళ్ళ కారణంగా వారు సహనం కోల్పోవడం, ఆగ్రహించడం జరుగుతుంది.

మహిళల్లో మాతృత్వపు లక్షణాలు మెండు కనుక వారు ఉపాధ్యాయ వృత్తికి తగినవారనే అభిప్రాయం ఒకటుంది. షన్నో, ఆకృతిల పట్ల దారుణంగా ప్రవర్తించిన వారిద్దరూ మహిళలే. ఇది యాదృచ్ఛికం కాదు. ఏ స్త్రీ అయినా తన సంతానాన్ని ప్రేమించినట్లు ఇతరుల పిల్లలను ప్రేమించ జాలదు. ఇది నిష్ఠుర సత్యం. శ్రీశారదామాత, మదర్ థెరెసా లాంటి మహితాత్ములకే ఇది సాధ్యం. ఇలాంటి వారి జీవితాలను ఆదర్శాలుగా స్వీకరిస్తే మానవతా విలువలు కొంతలో కొంత మెరుగుపడతాయి.

ఉపాధ్యాయవర్గంలో మానవతా విలువలు పెరగాలంటే, భారతీయ సమాజంలోనే మార్పు రావలసిన ఆవశ్యకత ఉంది. మానవతా విలువలు పెరగడానికి 'ఆర్ట్స్' లేదా 'హ్యూమానిటీస్' అనబడే శాస్త్రాల అవసరమున్నదని లోగడ (శ్రీ రామకృష్ణ ప్రభ - ఏప్రిల్ 2009 సంచికలో - 'విద్యలో విలువల ఆవశ్యకత') చెప్పడం జరిగింది. గణిత, విజ్ఞాన శాస్త్రాలకు ఇస్తున్న ప్రాముఖ్యం మానవతా శాస్త్రాలకు లేదు. కొన్ని పాశ్చాత్య దేశాలలో ప్రతి విజ్ఞాన శాస్త్ర విద్యార్థీ ఒక మానవతా శాస్త్రం కూడా అధ్యయనం చేయాలనే నియమం ఉంది. ఇది మన కళాశాలల్లో ప్రవేశపెట్టాలనే ప్రతిపాదన విశ్వవిద్యాలయాల ముందుకు తెచ్చినప్పుడు, విద్యావంతులైన తల్లితండ్రులే తీవ్రంగా వ్యతిరేకించడం జరిగింది. దేశ చరిత్ర, ఆర్థిక, సామాజిక, రాజనీతి శాస్త్రాల అధ్యయనమే ప్రజల సమస్యల అవగాహనకూ, దేశప్రగతికీ తోడ్పడుతుంది.

నేటి విద్యావంతులు అనేకులు ఆధ్యాత్మిక సంస్థలనూ, గురువులనూ ఆశ్రయించడం జరుగుతోంది. పోతే ఈ జ్ఞానాన్ని స్వలాభానికి వాడుకొంటున్నారే కానీ మానవతా విలువలను పెంపొందించుకొనే ప్రయత్నాలు జరగడం లేదు. రెండూ

సమానంగా సాగడమే, స్వామి వివేకానంద చెప్పిన 'ఆత్మనో మోక్షార్థం, జగద్ధితాయ చ' అర్థం.

రామకృష్ణ మఠం లాంటి ఆధ్యాత్మిక సంస్థలు ఉపాధ్యాయ వర్గానికి ప్రత్యేక శిక్షణా శిబిరాల ద్వారా ఆధ్యాత్మిక విలువలు బోధించే ప్రయత్నాలు చేస్తున్నాయి. పోతే ఈ శిబిరాలకు వచ్చేవారు ఎందరు ఆసక్తితో స్వచ్ఛందంగా వస్తున్నారో, ఎందరు యాజమాన్యం నిర్బంధం మూలంగా వస్తున్నారో, ఎందరు వీటిని ఆటవిడుపుగా భావిస్తున్నారో తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. ఏది ఏమైనా ఇవి ఎంతో కొంత ఉపయోగకరమన్న దాంట్లో సందేహం లేదు. కానీ దేశ విస్తీర్ణత, ఉపాధ్యాయుల సంఖ్యతో పోలిస్తే ఇవి ఏమాత్రం సరిపోవు. ఉపాధ్యాయులకు శిక్షణ కాలంలోనే ఆధ్యాత్మిక, మానవతా విలువలు నేర్పే అవసరం ఎంతైనా ఉంది. నేటి బాలలే రేపటి పౌరులన్న నినాదాన్ని కేవలం నోటితో పలకడం కాక, ఎలాంటి పౌరులను భవిష్యత్ కాలానికి అందజేయ నున్నామనే సంగతి విద్యావంతులు ఆలోచించాలి. అందుకు ఎలాంటి ఉపాధ్యాయులను తయారు చేస్తున్నామని కూడా ఆలోచించాలి. ❖

ఒదిగిన కొద్దీ ఎదుగుదల!

- ఆకెళ్ల రాఘవేంద్ర

కుచేలుడి కథ తెలియని వారుండరు. కుచేలుడి పట్ల శ్రీకృష్ణ పరమాత్ముడు చూపిన స్నేహభావం ఎలాంటిదో తెలియని వారుండరు. అయితే ఈ కథ నుండి నేటి ఆధునిక మానవులమైన మనం తెలుసుకోవలసినది చాలా ఉంది.

పోతన రచించిన ఆంధ్రమహాభాగవతంలోని దశమస్కంధం లోని కథ ఇది. కుచేలుడి అసలు పేరు సుదాముడు. అతి దారిద్ర్యంతో కట్టుబట్టలు కూడా లేని వాడు కావడం వల్ల కు-చేలుడు అనే పేరు తెచ్చుకున్నాడు. (చేలము అంటే బట్టలు. కుచేలము అంటే దుస్తులు లేని దుఃస్థితి).

సాందీప మహాముని ఆశ్రమంలో శ్రీకృష్ణుడు, బలరాముడు విద్యాభ్యాసం చేస్తున్న కాలంలో సుదాముడు వారి సహాధ్యాయి. అంటే కుచేలుడు సాక్షాత్తూ భగవంతుడికే బాల్య సఖుడన్నమాట. విద్యాభ్యాసం అయిపోయిన తరువాత తన ఊరు చేరుకొని, వివాహం చేసుకొని భార్యాబిడ్డలతో జీవిస్తున్నాడు కుచేలుడు.

అయితే కారణాలేవైనప్పటికీ, కుచేలుడు ఆర్థికంగా చితికిపోయాడు. తాను పస్తులుండడమే కాక భార్యాపిల్లల్ని సైతం పస్తులుంచాల్సిన స్థితి. రానురానూ పరిస్థితి మరీ దుర్భరం అయింది. గంజినీళ్ళయినా లేకపోవడంతో భార్య సుశీల, కుచేలుడితో - 'మీ చిన్ననాటి స్నేహితుడైన శ్రీకృష్ణుణ్ణి సహాయం అర్థించమ'ని వేడుకొంది.

ముందు తటపటాయించిన కుచేలుడు చివరకు సరేనని ద్వారకకు బయలుదేరాడు. బాల్య మిత్రుడికి కానుకగా కుచేలుడు ఏమివ్వగలడు? అందుకే చిరిగిన వస్త్రపు కొంగులో గుప్పెడు అటుకులు మూటగట్టుకొని పయనమయ్యాడు.

వెళుతున్నంతసేపూ కుచేలుడికి అనుమానాలే! 'కృష్ణుణ్ణి చూసి చాలా ఏళ్ళయింది. ఆయన యాదవ రాజ్య సంరక్షకుడు, సాక్షాత్తూ భగవంతుడు. ఆయన దర్శనం నాబోటి దరిద్రుడికి లభిస్తుందా? అసలు ద్వారపాలకులే నన్ను అడ్డగిస్తారేమో!' ఇలా సందేహాల శరపరంపరతో ద్వారకకు చేరుకొన్నాడు కుచేలుడు.

ఇక్కడో చిన్నమాట...

తమ తమ పూర్వజన్మ సుకృతుల వల్ల నైతేనేమీ, సంకల్ప బలం వల్లనైతేనేమీ, పట్టుదలతో పరిశ్రమించడం వల్లనైతేనేమీ, తమ బలహీనతల్ని అధిగమిస్తూ తప్పుల్ని సరిదిద్దుకొంటూ ముందుకు సాగడం వల్లనైతేనేమీ... ఇంకా ఏ కారణం వల్లనైతేనేమి - ఒక వ్యక్తి జీవితంలో ఉన్నత స్థితిని చేరుకోవడం జరుగుతుంది.

మనలో అందరమూ అటు కుచేలుడి స్థితినో, ఇటు కృష్ణుడి స్థితినో- జీవితంలో పొందే ఉంటాం. అందుకని 'అతనా.. స్కూల్లో మేమిద్దరం ఒకే బల్ల మీద కూర్చొని చదువు కొన్నాం. ఇప్పుడు వాడి అదృష్టం బాగుండి మంత్రి అయ్యాడనో, కోటీశ్వరుడు అయ్యాడనో, సినిమా తార అయ్యాడనో..' ఇలా ఏదో ఒకటి అంటుంటాం.

మనతో పాటు ఆడుకొన్న 'అతను'... అలా జీవితంలో ఉన్నత స్థితిని చేరుకోవడంతో ఇటు దుగ్ధతోనో, అటు అహం దెబ్బతినో 'అతని' గురించి చెడుగానో, చులకనగానో మాట్లాడడం జరుగుతుంది. లేదంటే 'అతను' తారస పడినప్పుడు స్థాయీభేదాలు మరచిపోయి ప్రవర్తించడం జరుగుతుంది. 'అతను' లేనప్పుడు చులకనగా మాట్లాడడమో, ఆ చనువును దుర్వినియోగపరచడమో జరుగుతుంది.

ఈ అవలక్షణాలేమీ లేని వాడు కుచేలుడు.

శ్రీకృష్ణుడంతటి వాడు తన బాల్యసఖుడైనా, ఆ శ్రీకృష్ణుడు సాక్షాత్తూ యదుకుల భూషణుడే అయినా, సంపన్నుడే అయినా, భక్తవత్సలుడే అని తెలిసినా, తాను గర్భదరిద్రంతో బాధపడుతున్నానని తెలిసినా... కుచేలుడు ఆ బాల్యస్నేహాన్ని దుర్వినియోగపరిచే ప్రయత్నం కానీ, చులకన చేసి మాట్లాడే

ప్రయత్నం గానీ, నలుగురితోనూ తనకు శ్రీకృష్ణుడితో గల అనుబంధాన్ని చెప్పి గొప్పలకుపోయే ప్రయత్నం గానీ చేయలేదు. అదే కుచేలుడి వ్యక్తిత్వం నుంచి మనం నేర్చుకోవాల్సిన సుగుణం.

అందుకే శ్రీకృష్ణ మందిరంలోకి ప్రవేశం లభిస్తుందో, లేదోనని భయపడుతూ వెళ్ళిన కుచేలుడికి అనూహ్య స్వాగతం లభించింది. కుచేలుడు వెళ్ళే సమయానికి – శ్రీకృష్ణుడు సుందర సమున్నత మణిమయ స్వర్ణసౌధంలో అతివలు వింజామరలు వీస్తుండగా, హంసతూలికా తల్పం మీద రుక్మిణీ సమేతుడై ఉన్నాడు.

దారిద్ర్యపీడితుడూ, కృశించి నీరసించినవాడూ, చిరిగిన వస్త్రాలతో ఉన్నవాడూ అయిన కుచేలుణ్ణి చూడగానే శ్రీకృష్ణుడు గబగబ పాన్పు మీద నుండి దిగి వచ్చి, ఆదరంతో అక్కున చేర్చుకొన్నాడు. తీసుకెళ్ళి తన పాన్పుపై పక్కనే కూర్చుండబెట్టుకొన్నాడు.

ఇక్కడ ఇంకోమాట. మనం కూడా జీవితంలో ఉన్నతస్థితికి చేరుకొంటాం. కార్లు, బంగళాలు కొంటాం. రాజకీయ రంగంలోనో, మరో రంగంలోనో పేరు ప్రఖ్యాతులు ఆర్జిస్తాం. వందిమాగధులు మన చుట్టూ ఉంటారు. మనం అడుగు తీసి అడుగు వేస్తే సమాచార ప్రసార సాధనాలు మన తోటే కదులుతాయి అనుకుందాం. పోనీ, ఇంత కాకపోయినా మన చిన్ననాటి స్నేహితుడితో పోలిస్తే కాస్త డబ్బు, పేరు సంపాదించాం అనుకొందాం.

అంతే! గర్వం వచ్చేస్తుంది. అతిశయం ఆవరించేస్తుంది. చూపు నేలపై కాకుండా చుక్కల్లోకి వెళ్ళిపోతుంది. చుట్టూ ఎవరున్నా కనిపించరు. అది కాదు జీవితం అంటే, అలా ప్రవర్తించడం కాదు వ్యక్తిత్వం అంటే అని చెప్పేందుకే 'కుచేల–కృష్ణ కథ'. గర్వాంధకారంతో కన్నుమిన్నూ తెలీకుండా సాగడం కాదు. అదే శ్రీకృష్ణ పరమాత్మ నుండి మనం నేర్చుకోదగ్గ జీవన సత్యం. అందుకే ఆయన భగవంతుడయ్యాడు. 'మిత్రమా! నాకేం తెచ్చావు' అంటూ కుచేలుడి నుంచి అటుకులు తీసుకున్నాడు.

కుచేలుణ్ణి సాగనంపి, అతనికే తెలియకుండా అతని దారిద్ర్యాన్ని పోగొట్టి అతను ఇహంలోనూ, పరంలోనూ సౌఖ్యం పొందేలా చేశాడు శ్రీకృష్ణుడు.

మన కన్నా ఎదిగిన వారిని చూసి ఈర్ష్యపడకూడదు. వారి ఉన్నతిని చూసి అసూయ చెందకూడదు. స్థాయీ భేదాలు మరచి ప్రవర్తించకూడదు. అవసరంలో స్నేహితులను సాయమడగడం యాచన కాదు. బాల్య సఖులను మరచి అహంకారంతో ప్రవర్తించడం వ్యక్తిత్వం అనిపించుకోదు. హితులను ఆదుకోకపోవడం స్నేహధర్మం కాదు. మన కన్నా తక్కువ స్థితిలో ఉన్నవారిని చూసీచూడనట్లు ప్రవర్తించడం భావ్యం కాదు. స్నేహంతో, వాత్సల్యంతో, అనురాగంతో సాగడమే జీవితం! డబ్బు, హోదా ఉన్నా లేకున్నా మిగిలేదీ, మిగలాల్సిందీ ఇదే!

"ఎదిగేటప్పుడు, పై పైకి ఎగిరేటప్పుడు చుట్టుపక్కల చూసుకొంటూ వెళ్ళు. పలకరిస్తూ వెళ్ళు. నేనే గొప్ప అని విర్రవీగుతూ వెళ్ళకు. ఎందుకంటే – కిందపడితే ఆ పడేటప్పుడు ఆదుకోవాల్సింది వీళ్ళే" అన్న సూక్తిని నేర్చుకోవడం, అమలు పరచడం అవసరం.

'ఒదిగిన కొద్దీ ఎదుగుదల'అనే సత్యాన్ని ఆవిష్కరించేదే కుచేలోపాఖ్యానం. ❖

అధికారాలకు అతీతమైన స్నేహబంధం

ఒకరోజు న్యూయార్క్‌లో దట్టంగా మంచు కురుస్తోంది. పాదచారులు చెవులకు కోటు కాలర్లు అడ్డంగా పెట్టుకుని నడుస్తున్నారు. ప్రక్కవాడు కూడా కనపడనంత దట్టంగా మంచు కురుస్తోంది.

అలాంటి వాతావరణంలో ఒక నల్లజాతి వ్యక్తి రెండు చేతులతోనూ రెండు బరువైన పెట్టెలు పట్టుకొని స్టేషన్ వైపు నడుస్తున్నాడు. బురదగా ఉన్న బాటపై అతడి కాళ్ళు జారిపోతున్నాయి. ఎంతో కష్టపడుతూ అతడు ఆ విధంగా నడుస్తూ ఉండగా ప్రక్క నుంచి "ఒకపెట్టె నాకు ఇవ్వు మిత్రమా" అన్న మాట వినపడింది.

నల్లజాతీయుడు నిర్ఘాంతపోయాడు. అప్పట్లో ఒక తెల్లవాడు, ఒక నీగ్రోతో అంత స్నేహంగా, ఆప్యాయంగా మాట్లాడటం కలలో కూడా ఊహించలేని విషయం.

అతడు కాస్త మొహమాటపడి "ఫర్వాలేదు" అని అంటూ ఉండగానే ఆ ప్రక్కనున్న తెల్లజాతి యువకుడు అతడి చేతి నుండి ఒక పెట్టెను తీసుకుని, అతడితో పాటు నడవసాగాడు. ఇద్దరూ మాట్లాడుకుంటూ ఒకరి వివరాలు ఒకరు తెలుసుకుంటూ ప్రయాణం సాగించారు. స్టేషన్ వరకూ ఆ విధంగా వెళ్ళి అక్కడ పెట్టె అందించి ఆ శ్వేత జాతి వ్యక్తి కరచాలనం చేసి వెళ్ళిపోయాడు. ఆ తరువాత వారిద్దరూ ఆ పరిచయాన్ని ఉత్తరాల ద్వారా కొనసాగించారు. ఇద్దరివీ రెండు వేర్వేరు సిద్ధాంతాలు. ఒకరు అమెరికాలోని నీగ్రోల హక్కుల కోసం పోరాడి చరిత్ర కెక్కిన 'బూకర్ వాషింగ్టన్'. ఆ తెల్లజాతి యువకుడు అమెరికా ప్రెసిడెంట్ అయిన 'టెడ్డీ రూజ్‌వెల్ట్'. సిద్ధాంతరీత్యా వీరిద్దరి భావాలు వేరైనప్పటికీ వారి స్నేహం మాత్రం కొనసాగింది. ❖

– స్వామి పరిజ్ఞేయానంద

సాయిరాం, శ్రీదత్త, రోహిత్ – నందమూరు, ప.గో. జిల్లా

ప్రశ్న: మమ్మల్ని ఎవరైనా తిట్టినా, అవమానించినా, విమర్శించినా చాలా బాధ కలుగుతుంది. అందువల్ల ఏ పనీ ఏకాగ్రతతో చేయలేకపోతున్నాం. విమర్శల్ని పట్టించుకోకుండా ఉండడం ఎలా సాధ్యమవుతుంది?

జవాబు: పొగడ్తలకు పొంగిపోవడం, తెగడ్తలకు క్రుంగిపోవడం మానవ సహజం. అభినందనల్ని ఆహ్లాదంగా ఆస్వాదించగలుగుతున్నప్పటికీ, అవమానాల్ని అంగీకరించలేక పోవడానికి గల కొన్ని ముఖ్య కారణాలు :

1. ఎప్పుడూ మనల్ని అందరూ మంచివారు అనుకోవాలనీ, మన నిర్ణయాలే సరైనవనీ అనుకొనే మనస్తత్వం. ఈ స్వభావం ఉంటే ఒక్క చిన్న విమర్శను కూడా భరించలేం. కాబట్టి ప్రశంసల్ని స్వీకరించిన విధంగానే, విమర్శల్ని కూడా ఆహ్వానించగలగాలి.

2. ఇతరులు మనల్ని విమర్శిస్తున్నారంటే అందులో ఎంతో కొంత నిజం ఉండే ఉంటుందని గ్రహించాలి. అగ్గి పుల్లకు తల మాత్రమే ఉంది. కొద్దిపాటి రాపిడికే అది భగ్గుమంటుంది. మనిషిగా పుట్టిన మనకు తలతో పాటు మెదడు కూడా ఉంది. కాబట్టి అవమానాలు ఎదురైతే ఆగ్రహించడం కన్నా ఆత్మవిశ్లేషణ చేసుకోవడం ఉత్తమం.

'తన మీద విసిరిన ఇటుకలను వినియోగించుకొని ఇళ్ళు కట్టుకోగలిగినవాడే తెలివైన వాడు' అని ఓ అనుభవజ్ఞుని మాట. ఇతరులు మన మీద కురిపించే విమర్శలను మన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడానికి వినియోగించుకోగలగాలి. అంతేగాని మనస్తాపంతో క్రుంగి, కృశించి పోకూడదు. అదే మహాత్ములకూ, సాధారణ మనుష్యులకూ గల తేడా!

One of the distinguishing differences between a big man and a petty one frequently is the ability to take criticism and profit by it instead of getting indignant, stewed-up and resentful. *- Douglas Lurton*

3. ఎవరైనా మన మంచి కోరి చేసే విమర్శల్ని అవమానకరంగా భావించకుండా, ప్రశాంతంగా ఆలోచించాలి. అది సద్విమర్శ అయితే స్వీకరించాలి.

ఒకసారి అబ్రహాం లింకన్ సైనిక దళాల్ని విభజించే విషయంలో ఓ ఉత్తర్వు జారీచేశాడు. ఆ నిర్ణయం తప్పని తెలిసిన మిలటరీ జనరల్ స్టాంటన్, 'లింకన్ ఓ మూర్ఖుడు' అని అవమానించాడు. ఆ విషయం విన్న లింకన్ బాధ పడకుండా స్టాంటన్‌తో విషయాన్ని వివరంగా చర్చించాడు. చివరికి తన నిర్ణయమే తప్పని లింకన్ అంగీకరించాడు. కాబట్టి మనకు మేలు చేసే విమర్శల్ని సావధానంగా ఆలోచించి సరిదిద్దుకోవడం మంచిది.

4. ఎవరైనా ద్వేషంతో మనల్ని విమర్శిస్తే, అలాంటి విమర్శల్ని పట్టించుకోకుండా మన ప్రశాంతతను కాపాడుకోవాలి.

ఒకడు, బుద్ధుణ్ణి ఎడతెరిపి లేకుండా అరగంటసేపు దుర్భాషలాడాడు. బుద్ధుడు ప్రశాంతంగా అంతా విన్నాడు. 'ఎదుటి వ్యక్తి అనవసరంగా అలా తిడితే ఒక్క మాట కూడా బదులు చెప్పకుండా ఎలా ఉండగలిగారు' అని బుద్ధుణ్ణి ఓ శిష్యుడు అడిగాడు. అందుకు 'అతడి మాటలు వట్టి గాలి మూటలు (నిరాధారాలు). వాటిని తలచుకుంటూ చింతించడం ఎందుకు! గాలి మాటలు గాలికే పోతాయి' అని నవ్వుతూ బదులిచ్చాడు బుద్ధుడు.

5. విమర్శల్ని రోజుల తరబడి నెమరువేసుకుంటూ మథనపడడం మంచిది కాదు. అలా చేయడం శీతకాలంలో చలివేస్తే వేసవి కాలంలోనూ వణకడం లాంటిది. కాబట్టి ఎప్పుడు విన్న విమర్శల్ని అప్పుడే మరచిపోవాలి.

6. విమర్శల వల్ల బాధ కలిగినప్పుడు ఒంటరిగా ఉంటే మనస్సు మరింత అలజడికి లోనవుతుంది. కాబట్టి మంచి సాహిత్యం చదవడం, సన్నిహితులతో మనస్సు విప్పి మాట్లాడడం, దేవాలయాల్లో సంకీర్తన, సత్సంగాల్లో పాల్గొనడం లాంటివి చేయాలి.

ఈ ఆరు సూచనల్ని కొంతైనా ఆచరించగలిగితే, విమర్శల అస్త్రాల బారి నుండి మనల్ని మనం రక్షించుకోవచ్చు. ❖

మీ సందేహాల్ని పంపాల్సిన చిరునామా :

యువవాణి

శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029



విజయం నీ చేతిలోనే ఉంది

- స్వామి సేవ్యానంద

జీవితంలో విజయం సాధించాలనే అందరూ ఆశిస్తారు కాని, అపజయం పొందాలని ఎవరు మాత్రం కోరుకుంటారు? నీవు విజయం లేదా పరాజయం పొందడమన్నది నీ చేతిలోనే ఉంది. జీవితంలో విలువైన సమయం గడిచిపోయాక ఏమీ సాధించలేక పోయామని బాధపడేకన్నా ముందు నుంచే పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం మన సొంతమౌతుంది. విజయం సాధించడానికి మన నిత్య జీవితంలో ఆచరించదగ్గ కొన్ని ఉపాయాలను చూద్దాం:

లక్ష్యాన్ని నిర్ణయించుకో: మనలో చాలామంది లక్ష్యం లేకుండానే జీవితం గడుపుతారు. లక్ష్యం లేని జీవితం దీపం లేని ఇల్లులా అంధకారమవుతుంది. 'లక్ష్యం' అనే దివ్యకాంతి మన జీవితంలో వెలుగును నింపి, మన పురోగతికి మార్గదర్శకమవుతుంది. అందుకే మనకంటూ ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని దాన్ని సాధించే ప్రయత్నంలో ముందుకు సాగిపోవాలి. చిన్న అలలు కలిసి శక్తివంతమైన పెద్ద కెరటంగా మారినట్లే, నేడు మనం చిన్న లక్ష్యాలను సాధించగలిగితే భవిష్యత్తులో మన అంతరంగంలో ఉన్న 'దివ్యత్వాన్ని' వ్యక్తం చేసి, జీవిత గమ్యాన్ని చేరుకోగలం.

మనం ఉన్నతమైన మార్గంలో వెళ్తున్నపుడు ఎన్నో భావాలు, ఆదర్శాలు మన ముందుంటాయి. వీటన్నిటినీ ఒకేసారి ఆచరించే ప్రయత్నం చేస్తే, చివరికి ఏమీ సాధించలేక విఫలులమవుతాం. అందుకే ముందుగా ఏదైనా ఒక భావాన్ని తీసుకుని, దాన్ని మన జీవితంలో ఆచరించే ప్రయత్నం చేయాలి. "ఒక భావాన్ని స్వీకరించండి. దాన్ని మీ జీవితంగా చేసుకోండి. దాన్ని మననం చేయండి. కలగనండి, ఆ భావంలోనే పరవశులై జీవించండి. మీ మెదడు, కండరాలు, నరాలు, శరీరంలోని ప్రతిఒక్క భాగం ఆ భావంలో పూర్తిగా తన్మయం కావాలి. మిగిలిన అన్ని భావాలను ఒక పక్కన పెట్టండి. ఇదే విజయానికి దారి" అని స్వామి వివేకానంద చెబుతారు.

సానుకూల ఆలోచనలు – ప్రతిభకు సోపానాలు : మనకు ఆలోచనలు తప్పనిసరైనపుడు మన మనసుకు, శరీరానికి శక్తినిచ్చే సానుకూలమైన ఆలోచనలు (పాజిటివ్ థింకింగ్) చేసి ప్రతికూలమైన ఆలోచనలకు (నెగిటివ్ థాట్స్) దూరంగా ఉండాలి. నేడు ప్రపంచంలో ఆరోగ్యవంతంగా ఎక్కువ కాలం జీవించేవారిలో జపాన్ దేశస్థులు అగ్రస్థానంలో ఉన్నారు. సానుకూలమైన ఆలోచనలు, సానుకూలమైన పనులు చేయడం దీనికి ఒక ప్రధాన కారణమని జపానుకు చెందిన డాక్టర్ షిరాసవా చెబుతారు. నేడు మంచి విద్యార్హతలు గల కొంతమంది యువకులు ప్రతికూలమైన ఆలోచనలకు బానిసలై, హంతకులుగా, నక్సలైట్లుగా, తీవ్రవాదులుగా మారి సమాజానికి భారమవుతున్నారు. వ్యక్తిగతమైన, సామాజికమైన సమస్యల్ని పరిష్కరించడానికి బాధ్యతారహితమైన హింసావాదం ఎప్పుడూ సరైన మార్గం కాదు. సానుకూలమైన ఆలోచనలకు, నిర్మాణాత్మకభావాలకు ప్రాధాన్యమిచ్చినపుడే మనం విజయపతాకాన్ని శాశ్వతంగా ఎగురవెయ్యగలం.

మనం ఏదైనా పనిని సాధించేముందు ఎన్నో అవరోధాలు ఎదురవుతాయి. ఈ ప్రతికూలమైన పరిస్థితులను మనకు అనుకూలంగా మార్చుకొని, విజయం పొందడంలోనే నిజమైన పురుషత్వం ఉంది. మన జీవితంలో పరాజయమన్నది చాలా సహజమైన విషయం. ఒకసారి పరాజయం పొందడంతోనే మనం నిరాశ చెందకూడదు. "నేను సాధించగలను, ఈ లోకంలో నాకు అసాధ్యమైనదేదీ లేదు" అన్న దృఢ సంకల్పంతో మరింత ఉత్సాహాన్ని పెంచుకొని మనం విజయం పొందే ప్రయత్నం చేయాలి.

విజయానికి సులభమైన ఉపాయం: ఎప్పుడూ తమ స్వార్థ ప్రయోజనం కోసమే ఆలోచించేవారు తాత్కాలికంగా ఫలితాలను పొందినప్పటికీ ఏదో ఒకరోజు తమ పరాజయాన్ని అంగీకరించవలసి వస్తుంది. అత్యాశతో లంచాలకు బానిసలై, తమ బ్యాంకు బ్యాలెన్సులను పెంచుకొనే స్వార్థపరులు నేడు కాకపోతే రేపు నలుగురిముందూ నవ్వులపాలు కావలసిందే! మనం ఎంత నిస్వార్థ పరులమైతే విజయానికి అంత దగ్గరైనట్లుగా తెలుసుకోవాలి. మనం పురోభివృద్ధి చెందడానికీ, మన దేశాన్ని ప్రగతిపథంలో ముందుకు తీసుకుపోవడానికీ ఇదే సులభమైన ఉపాయం. అందువల్ల మనం ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని, సానుకూలమైన ఆలోచనలతో, నిస్వార్థతతో ముందుకు సాగితే 'విజయం' మన సొంతమవుతుంది. ❖

అసలైన శరణాగతి

– స్వామి రఘునాయకానంద

ప్రతి విద్యార్థీ ఎంతో కొంత కష్టబడి పరీక్షల్లో నెగ్గకు రావాలనే కోరుకొంటాడు. కానీ కొంతమంది రేపు చదవవచ్చులే, మాపు చదవవచ్చులే అని వాయిదాలు వేస్తూ, కాలప్రవాహంలో కొట్టుకుపోతారు. పరీక్షలు దగ్గర కొచ్చేసరికి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపోతారు. ఇక భగవంతుడే రక్షించాలంటూ గుళ్ళ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ కనిపిస్తారు. వాళ్ళ బలహీనతను కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న ప్రయత్నమే ఈ ప్రదక్షిణలు, లేక భగవంతునికి శరణాగతులు కావడమా?

ప్రయత్నం, ఆ పై శరణాగతి!

ఆకాశాన ఒక విమానం ఎగురుతూ ఉంది. అకస్మాత్తుగా ఇంజన్లో ఏదో లోపాన్ని గమనించిన పైలట్ దాన్ని సరిచేయడానికి ప్రయత్నించాడు. కానీ, కుదరకపోవడంతో లాభం లేదని గ్రహించాడు. ప్రమాదం అంచున ఉన్నానని తెలుసుకొని వెంటనే పారాచ్యూట్‌ను నడుమకు బిగించు కున్నాడు. ఒక చిన్న మంచినీళ్ళ సీసా, పటం, దిక్సూచులను ఒక సంచీలో వేసుకొని ఆ పైలట్ విమానం నుంచి పారాచ్యూట్ సహాయంతో కిందకు దూకాడు. ఒక ఎడారిలో దిగాడు. వెంటనే పటం, దిక్సూచి సహాయంతో ఒయాసిస్సు కొద్ది మైళ్ళ దూరంలో ఉందని తెలుసుకొన్నాడు. ఆ ఎడారి ఇసుకలో, భానుడి ప్రతాపాగ్నిని అనుభవిస్తూ, ఆ ఒయాసిస్సు వైపుగా నడక ప్రారంభించాడు. మధ్యలో ఆ చిన్న సీసాలో ఉన్న నీళ్ళను త్రాగుతూ నడుస్తున్నాడు. అలసట అతణ్ణి ఆవహించింది. ఒయాసిస్సు ఒక పర్లాంగు దూరంలో కనిపిస్తోంది. కానీ నడవడానికి కావలసిన ఓపికా లేదు, దప్పిక తీర్చుకుందామంటే మంచి నీళ్ళూ నిండుకొన్నాయి. ఒక్క అడుగు కూడా వేయలేని స్థితి. అప్పుడు ఇక భగవంతుడే శరణు అని ఆర్తితో సహాయం కోసం విలపించాడు. మొదట చేయవలసిన ప్రయత్నం అంతా చేసిన తరువాత భగవంతునికి శరణాగతులం కావాలన్నది ఈ కథ చెప్పకనే చెబుతోంది.

నా సుఖదుఃఖాలను సహనంగా భరించగల శక్తి నాకివ్వు!

నా ప్రేమ సేవలో ఫలవంతం చేసుకొనే శక్తిని నాకు ప్రసాదించు!

నిరుపేదలను నిర్లక్షించిన, అహంభావపూరితమైన బలవంతులకు మోకరిల్లకుండే బలాన్ని నాకివ్వు!

దైనందిన ఒడుదొడుకుల నుండి నా మనస్సును ఉద్ధరించుకునే శక్తిని నాకివ్వు!

ఆ శక్తితో నేను సాధించింది, లాభించింది నీకు అర్పించేలా మరలా... నా కిచ్చిన శక్తినంతా నీ ఇచ్ఛకు అర్పించుకోగల ధీరత్వాన్ని నాకు ప్రసాదించు!!

(రవీంద్రనాథ్ టాగోర్ రచన 'గీతాంజలి' నుండి)

శ్రమను అర్పించడమే ఈశ్వరప్రణిధానం

ఈశ్వర ప్రణిధానం అంటే మనం చేస్తున్న ప్రతి కార్యాన్నీ భగవంతునికి సమర్పించడమే! అంటే భగవంతునికి సంపూర్ణంగా శరణాగతులం కావడం. చేసే ప్రతి కర్మనూ భగవంతునికి అర్పించాలి. మీరు పడ్డ శ్రమను విడనాడాలంటే ముందు బాగా శ్రమ పడాలి. పట్టుదలతో కార్యాచరణకు పూనుకోవాలి. ముందు మనకు ధర్మాచరణ, శ్రమల యొక్క విలువ తెలిసి ఉండాలి. మనం శాయశక్తులా ప్రయత్నం చేయడం ద్వారా మనల్ని మనం అభివృద్ధిపరచుకోవాలి. ధీరులూ, సమర్థులైన కార్యసాధకులకే అదృష్టం అను కూలిస్తుంది. దిగంతాలను తాకే వీరోచితమైన ధైర్యోత్సాహాలతో ప్రయత్నిస్తూ, కడ దాకా వేచి ఉండేవారే అద్భుతాలను సుసాధ్యం చేయగలరు. 'కావలసింది పురుషకారం అని గ్రహించు. పురుషకార విహీనునికి పరమేశ్వర అనుగ్రహం లభించడం కల్ల' – అని స్వామి వివేకానంద అంటారు.

శరణాగతి – ఈశ్వరప్రణిధానం

హనుమంతుడు మహామేధావి, శక్తి సంపన్నుడు, ఎంతో సమర్థత కలిగినవాడు కనుక 'నా సమస్తమూ రామునికి అర్పించాను. నా హృదయంలో రాముణ్ణి ప్రతిష్ఠించుకొన్నాను, నేనాయన సేవకుణ్ణి' అని చెప్పుకోగలిగాడు. ఇక్కడ శరణాగతి భావంలోని అర్థం కనిపిస్తుంది. కానీ మామూలుగా 'నేను భగవంతునికి అర్పించాను' అనడంలో యథార్థమైన శరణాగతి కన్పించదు. అది కేవలం నోటి మాటే!

ప్రయత్నం ద్వారా సాధించిన జయం, అపజయం – ఈ రెండింటినీ ఈశ్వరార్పణ చేయడం ఈశ్వర ప్రణిధానం. అదే అసలైన శరణాగతి. ❖

ముందుకు సాగిపో!

- స్వామి ప్రేమేశానంద

(1884-1967)

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ -వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గచీ,
10 ఫిబ్రవరి 1954

ప్రియమైన తల్లీ!*

ఈ అనంత విశ్వాన్ని సృజించి, పోషించి, తిరిగి తనలోనే లయం చేసుకొనేందుకు మూలమైన ఆ మహాశక్తి మీ అందరి కోసం మానవ రూపం దాల్చింది. ఆమె నిన్ను తన ఒడి లోనికి తీసుకుంది. ఇది నిజం కాదా చెప్పు? ఇప్పుడు నువ్వు నూటికి నూరు పాళ్ళూ నా తల్లివి అయ్యావు. శారదమ్మ పాదాల చెంత సమర్పితమైన స్వచ్ఛమైన పుష్పం లాంటి దానివి నువ్వు. అమ్మ అర్చనలో అర్పితమైన శ్వేత కుసుమ మాలిక లాంటి దానివి.

మనస్సు భగవంతుని వైపు పోవడం లేదంటావా? పోకపోతే ఏం! రసగుల్లాలు లభించలేదని క్రుళ్ళిపోయిన చేపలు తింటావా? శ్రీరామకృష్ణ కథామృతం అనుబంధంలో స్వామి వివేకానంద ఏమి చెప్పారో నీకు జ్ఞాపకం ఉందా? "రాముడు లభించలేదనే నెపంతో కాముణ్ణి పట్టుకొని ఈ సంసార జంఝాటంలో పడుతూ లేస్తూ, పిల్లల్ని కనే యంత్రాల మవుతామా? రామ! రామ!".

ఒక వ్యక్తి తన గది తలుపులు బిగించుకొని నిద్ర పోతున్నాడు. అకస్మాత్తుగా ఆ ఇంటికి నిప్పంటుకుంది. అతని స్నేహితుడొకడు గది గోడ పగలగొట్టి గదిలో ప్రవేశించి వాణ్ణి బయటకు లాగి రక్షించాడు. అదంతా తెలిశాక ఆ వ్యక్తి ఎంతగా ఉప్పొంగిపోతాడో ఊహించు. మన పరిస్థితి కూడా కచ్చితంగా అలాంటిదే. శారదమ్మ మనల్ని ఈ సంసార దావానలం నుంచి బయటకు లాగి కాపాడింది.

మీరంతా మనఃస్ఫూర్తిగా విచక్షణను అలవరచుకోవాలి. మీ అందరిలో స్త్రీ స్వభావం ఉంది. కానీ నిజానికి ఆత్మ స్వభావం అది కాదు. అందుచేతనే మీ శరీరాలనే మీరుగా భావిస్తూ అనవసరమైన బాధకు గురై, అతి సిగ్గు, బలహీనతలతో మీ ముఖాలను ముసుగులో దాచుకోవడం లాంటివి చేస్తుంటారు.

మీకు మీరు దృఢంగా ఇలా అనుకోవాలి: "నేను ఈ శరీరాన్ని కాదు. ఈ మనస్సును కాదు. ఈ బుద్ధిని కాను." ఆ పై జాగ్రదవస్థలోనూ, స్వప్నావస్థలోనూ, దీర్ఘసుషుప్తి లోనూ సాక్షీభూతమైన శుద్ధ ఆత్మతో మీ మనస్సును పోల్చుకోండి. ఎంతో కర్మ, భక్తి మీకు సహజసిద్ధంగానే బహూకృతమయ్యాయి. వాటిని మీరు యోగ జ్ఞానాలతో మిళితం చేస్తే, ఇక ఏ మాత్రం భయం కానీ, ఆందోళన కానీ ఉండవు. ఇది గ్రహించండి.

ప్రేమాశీస్సులతో...
స్వామి ప్రేమేశానంద

*అప్రకటిత విద్యార్థిని - (వయస్సులో చిన్నవారైనప్పటికీ స్త్రీలను తల్లీ అని సంబోధించడం భారతీయ సంప్రదాయం)

తెలుగుసేత : కె. త్రివిక్రమరావు

మా ఆరోగ్యానికి చేయూతనివ్వరూ?

1985వ సంవత్సరములో సామాన్యరీతిలో రాజమండ్రి రామకృష్ణ మిషన్‌వారిచే గిరిజన సంచార వైద్యశాల ప్రారంభించబడింది. ప్రస్తుతం ఈ వైద్యశాల ఇద్దరు వైద్యులు, రెండు వాహనములు, 8 మంది మెడికల్ మరియు పారామెడికల్ సిబ్బందితో పాటు ఎక్స్‌రే, ఇసిజి మరియు లేబొరేటరీ వంటి సదుపాయములతో నడుస్తున్నది. రాజమండ్రి నుంచి 53 కి.మీ. దూరంలోగల రంపచోడవరంలో ఐ.టి.డి.ఏ. వారు సమకూర్చిన నివాస స్థలములో వైద్య సిబ్బంది బసచేస్తూ గురువారం నుంచి ఆదివారం వరకు నాలుగురోజులపాటు వివిధ గిరిజన ప్రాంతాలను సందర్శిస్తుంటారు. సుమారు 1,500 మంది రోగులు ఈ క్యాంపులద్వారా చికిత్సపొందుతున్నారు. ఏప్రిల్ 2008 నుంచి మార్చి 2009 వరకు 60,000 మంది రోగులకు ఈ క్యాంపుల ద్వారా చికిత్స చేయడంతో బాటు ఉచితంగా మందులు కూడా అందించబడినవి.

రంపచోడవరంలోగల బేస్‌క్యాంపులో అత్యాధునిక ఉపకరణాలతో కూడిన ఒక లేబొరేటరీ ఏర్పాటు చేయబడింది. RNTCP-DOT స్కీమ్ ద్వారా క్షయవ్యాధిగ్రస్తులకు చికిత్సతోబాటు పోషకాహారం కూడా అందివ్వబడుతున్నది. అంతేకాకుండా వివిధ కార్యక్రమాల ద్వారా అనేక ఇతర రోగాలకు సంబంధించిన వివరాలను తెలియచేయడం జరుగుతోంది. సుమారు 1000 మందికి పైగా హాజరవుతున్న ప్రత్యేక వైద్య శిబిరాలలో వివిధ వైద్యనిపుణులు సేవలందిస్తున్నారు. కంటివైద్య శిబిరాలలో క్యాటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహించడంతో బాటు, ఉచితంగా IOL లేదా కంటి అద్దాలు కూడా అందివ్వబడుతున్నవి.

ప్రస్తుత అవసరాలు : అధిక ధరల వలనా మరియు చాలీచాలని విరాళాలతోనూ ప్రస్తుతం ఈ సేవా కార్యక్రమాలను నడిపించడం చాలా కష్టతరమవుతున్నది. రోగుల సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతున్నది. ప్రభుత్వంవారు అందిస్తున్న గ్రాంటు మా ఖర్చుకు ఏ మాత్రం చాలడం లేదు. పైగా గ్రాంటు ఎల్లకాలం అందుబాటులో కూడా లేదు.

మీ సహాయం మాకవసరం : ఈ నిధులలేమి నుంచి మాకు చేయూతనందించి ఈ సేవా కార్యక్రమాలు ఉన్నత రీతిలో నిరంతరం నడపగలిగేలా మా మిత్రులు, శ్రేయోభిలాషులు, భక్తులు, ప్రభుత్వరంగ సంస్థలు మరియు ఇతర వాణిజ్య సంస్థలకు మా విన్నపం. మీరందించే సహాయం మా ఈ సేవాకార్యక్రమాలు భవిష్యత్తులో నిరాటంకంగా సాగేందుకై ఎంతగానో తోడ్పడుతుంది.

మా అవసరాలు

ఖర్చు	వార్షిక మొత్తం
మందులు	12,00,000
జీతభత్యాలు	8,00,000
ఇంధనం & నిర్వాహక ఖర్చులు	70,000
క్షయవ్యాధి గ్రస్తులకు ఆహారం	25,000
ముద్రణ తదితరాలు	10,000
కంటివైద్య శిబిర ఖర్చులు	20,000
ప్రత్యేక వైద్య శిబిర ఖర్చులు	40,000
మరమ్మత్తులు	10,000
విద్యుత్తు చార్జీలు	25,000
తపాలా మరియు టెలిఫోను	10,000
వైద్య సామాగ్రిలు	5,000
ఇతరములు	5,000
మొత్తం ఖర్చు	**22,20,000**

ఇలా సహకరించగలరు : రూ. 50 లక్షల శాశ్వత నిధిని సమకూర్చేందుకై విరాళాలనందివ్వమని మనవి. (కనీస విరాళం రూ. 10,000/–) లేదా మా వార్షిక ఖర్చుకై కొంత మొత్తాన్ని అందించండి.

రామకృష్ణ మిషన్, రాజమండ్రి పేరున అందించే విరాళాలన్నీ ఆదాయపు పన్ను సెక్షన్ – 80జి క్రింద మినహాయించబడినవి.

చెక్కులు లేదా డిమాండు డ్రాఫ్టులు " రామకృష్ణ మిషన్, రాజమండ్రి" పేరున పంపించగలరు.

భగవత్సేవలో

స్వామి అక్షరాత్మానంద, సెక్రటరీ

రామకృష్ణ మిషన్

వివేకానంద రోడ్, రాజమండ్రి, ఆంధ్రప్రదేశ్ - 533 105

ఫోన్ : 0883-2473112, Email : rkmrjy@gmail.com

Advt.,

శ్రీరామకృష్ణ మఠం

న్యూ నాథమ్ రోడ్, రిజర్వ్ లైన్, మదురై - **625 014**,
ఫోన్: 0452-2680224, 2681181, email : rkmath@dataone.in

శ్రీరామకృష్ణ మఠం, మదురైలో స్వామి వివేకానందుల కాంస్య విగ్రహ ప్రతిష్ఠ

స్వామి వివేకానంద 1893 సెప్టెంబర్ 11న విశ్వమత మహాసభలలో ప్రసంగించి ప్రపంచ ప్రఖ్యాతి గాంచారు. వారు అమెరికా వెళ్ళేముందు మొట్టమొదటి మారు మదురై సందర్శించారు.

తిరిగి భారతదేశం రాగానే 1897లో వారు రెండవమారు మదురై వచ్చారు. అక్కడ 1897 ఫిబ్రవరి 2న జరిగిన ఒక సభలో ప్రసంగించారు.

స్వామీజీ మదురై సందర్శనల జ్ఞాపకార్థం మదురై రామకృష్ణ మఠం $10^{1/2}$ అడుగులు గల స్వామీజీ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిశ్చయించింది.

స్వామి వివేకానందుల కాంస్య విగ్రహానికి అయ్యే మొత్తం ఖర్చు **రూ।। 6,50,001/-**

ఈ ప్రణాళిక పూర్తవ్వడానికి ఉదారులైన భక్తులు, మిత్రుల నుంచి విరాళాలను కోరుతున్నాం. విరాళాలన్నింటికీ ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80(జి) కింద పన్ను మినహాయింపు ఉంది.

విరాళాలను Sri Ramakrishna Math, Madurai పేరున చెక్కు/ డి.డి. తీసుకొని, "Sri Ramakrishna Math, New Natham Road, Reserve Line, Madurai - 625014" కు పంపాల్సిందిగా మనవి.

మీ కోసం, మీ కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం మదురైలోని జగజ్జనని శ్రీశ్రీ మీనాక్షి, శ్రీశ్రీ సుందరేశ్వర శివుణ్ణి, భగవాన్ శ్రీరామకృష్ణులు, దివ్యజనని శ్రీ శారదాదేవి, స్వామి వివేకానందులను ప్రార్థిస్తూ,

ధన్యవాదములతో

భగవత్సేవలో
స్వామి కమలాత్మానంద
అధ్యక్షులు.

Advt.,

మఠం సందర్శనతో మార్పు

– కె. రాజేష్

నా పేరు కె. రాజేష్. మాది శ్రీకాకుళం జిల్లా, బడగాం అనే గ్రామం. నేను డిగ్రీ పూర్తి చేసి, ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లోని పఠాన్‌చెరువు ప్రాంతంలో ఉంటున్నాను. నా వయస్సు 21 సంవత్సరాలు. నా జీవితం గమ్యం లేని నావలా సాగింది. ఏమీ తెలియకపోయినా, అన్నీ తెలుసు అనే భ్రాంతిలో గడిపాను. జీవితం అంటే ఆట, పాట... సినిమా... షికారు అనే భ్రమలో గడిపాను. "నవ్వేవాడు, నవ్వించేవాడు దేవుడు, నవ్వుల పాలయ్యేవాడు జీవుడు" అని తెలుసుకోలేక పోయాను.

మా అన్నయ్య స్నేహితుడు 'శ్రీరామకృష్ణ మఠం' గురించి చెప్పారు. అది విని మా అన్నయ్య (ఇంద్రతనయ) 'శ్రీరామకృష్ణ మఠం' చూడాలని వెళ్ళాడు. అక్కడ ఉన్న వాతావరణం గురించి నాకు వివరంగా చెప్పాడు.

అక్కడి గాలి... మనస్సునూ, బుద్ధినీ ఉత్తేజపరిచే పిల్లనగ్రోవి స్వరం. అక్కడి నీరు.... మనిషికి జీవితంపై ఆశ పుట్టించే ఉత్ప్రేరకం. అక్కడి దేవాలయ ప్రాంగణం... ఓ భూలోక స్వర్గం.

అక్కడి ప్రతి మాట... ఒక ఆణిముత్యం. అక్కడి ప్రతి వాక్కు... వేద మంత్రం. అక్కడి మనుష్యులు... భగవంతుని రూపాలు అని చెప్పాడు. 'మానవసేవే మాధవసేవ' అనడానికి ప్రత్యక్ష సాక్షి 'శ్రీరామకృష్ణమఠం' అని తెలిపి, కొన్ని పుస్తకాలు, రామకృష్ణ భజనల సి.డి.లను నాకు బహుమతిగా ఇచ్చాడు. ఆరోజు రాత్రి నా కళ్ళకు నిదుర కరువైంది. నా మనస్సు వేదనాభరితమై, దుఃఖ సాగరంలో మునిగిపోయాను.

మరుసటి దినం నా పయనం 'శ్రీరామకృష్ణమఠం'కి సాగింది. ఆ రోజు మర్చిపోలేనిది. మా అన్నయ్య చెప్పింది కేవలం ఒక అణువంతేనని, నా కళ్ళతో సందర్శిస్తే కానీ నాకు తెలియరాలేదు.

"దృఢమైన క్రమశిక్షణ గల మనస్సు స్నేహితునిగా సహాయం చేస్తుంది. కానీ బలహీనమైన, స్వాధీనంలో లేని నిరాశా నిస్పృహలకు లోనైన మనస్సు శత్రువులా వ్యవహరించి వినాశనానికి దారితీస్తుంది" ...ఇలా అక్కడ ఉన్న ప్రతి మాటా నా కోసమే అన్న విధంగా ఉంది.

ప్రధానంగా... "బ్రతికినా, చచ్చినా మీ సొంత శక్తి మీదనే ఆధారపడండి. ఈ ప్రపంచంలో పాపం అనేది ఉంటే అది బలహీనతే. బలహీనతను అన్ని విధాలా విడిచిపెట్టండి. ఎందుకంటే బలహీనతే పాపం, బలహీనతే మరణం" అన్న స్వామి వివేకానంద సందేశం చదివాక నా ఆలోచనలు మారాయి.

"జీవితంలో మనం ఎన్నో సమస్యలతో సతమతమవు తుంటాం. వాటిని ఎదుర్కొనేందుకు ఎంతో శక్తి కావాలి. ఆ శక్తి జ్ఞానం నుంచి జనించినదైతే మరింత సులువుగా సమస్యల్ని పరిష్కరించుకోగలం" అన్న స్వామీజీ మాట అక్షర సత్యం. కాదు, కాదు జీవిత సత్యం.

ఇప్పుడు మా ఇంటిని ఒక చిన్న వివేకానంద గ్రంథాలయంగా మార్చుకున్నాను. నేను మారాను. నా స్నేహితులను మార్చాను. నిజంగా సమస్యల సాగరాన్ని దాటించేందుకు స్వామీజీ మధుర వాక్కులు ఓ వరమని నా ప్రగాఢ విశ్వాసం. ❖

కె. రాజేష్ పఠాన్‌చెరువు, హైదరాబాదు.

మనస్సును పులకింపజేసిన స్వామీజీ ప్రసంగం

– జె. రామకృష్ణ

స్వామి వివేకానంద గురించి నేను ఇంటర్ (2వ సంవత్సరం)లో తెలుసుకున్నాను. అమెరికాలో జరిగిన సర్వమత మహాసభల్లోని స్వామీజీ ప్రసంగం చదువుతూ ఉంటే మనస్సు పులకిస్తుంది. "సోదర సోదరీమణులారా! మీకు భారతీయులందరి తరఫున నా నమస్కారాలు. మా భారతదేశం సనాతన ఋషి సంప్రదాయం గలది. ఎన్నో పవిత్రమైన నదులు, ఎందరో మహానుభావులు జన్మించిన పుణ్యభూమి. అలాంటి దేశంలో జన్మించినందుకు నేను గర్విస్తున్నాను" – ఇలా సాగుతుంది స్వామీజీ ప్రసంగం.

ఇలాంటి వాక్యాలు చదువుతూ ఉంటే మనలోకి ఏదో తెలియని శక్తి ప్రవేశించినట్లనిపిస్తుంది.

స్వామి వివేకానంద ముఖంలో వివేకం, ఆనందం – రెండూ ప్రకాశిస్తూ ఉంటాయి. ఇలాంటి మహోన్నత వ్యక్తుల గురించి చిన్న తరగతుల నుంచే ఏదో ఒక విధంగా విద్యార్థులకు తెలియజేయడం వల్ల వారిలో మంచి మార్పులను తీసుకురావచ్చని నా అభిప్రాయం. ❖

జె. రామకృష్ణ, వెల్ధి, మహబూబ్‌నగర్ జిల్లా.

ఆచార్యదేవోభవ!

– ఆర్. కృష్ణ

'నేను ఇంగ్లాండు వెళ్ళాల్సి వస్తే చదువుకోవడానికి కాదు, చదువు చెప్పడానికే వెళ్తాను'అని పలికిన మహనీయుడు, ఉపాధ్యాయ వృత్తి నుండి రాష్ట్రపతి పదవి వరకు అధిరోహించిన మహామనీషి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. 1888 సెప్టెంబర్ 5వ తేదీన చిత్తూరు జిల్లా సర్వేపల్లిలో వీరస్వామి, సీతమ్మ అనే దంపతులకు జన్మించారు.

ఆచార్యులకు దేవుడువంటివాడుగా, అధ్యయన, అధ్యాపన వ్యవస్థలకే గర్వకారణంగా నిలిచిన సర్వేపల్లి రాధాకృష్ణన్ తన అధ్యాపక వృత్తిలో పాటించిన ధర్మాలు ఉపాధ్యాయులకు ఆచరణీయాలు.

వివేకచూడామణిలో ఉపాధ్యాయునికి ఉండవలసిన లక్షణాలను తెలియచేశారు: 1. **శ్రోత్రియోః** విషయాలపై సంపూర్ణ అవగాహన కలిగిఉండాలి. 2. **అవృజినోః** నిష్కళంక, నిష్కల్మషమైన మనస్సు కలిగి ఉండాలి. బోధనలో నా జీవితం సార్థకమైంది అనే ఆత్మసంతృప్తి చెందాలి. 3. **అకామహతః** గురుశిష్యుల బంధం నిస్స్వార్థమైనది. తల్లి తన బిడ్డకు సేవలందించేటంత నిష్కామ సేవాతత్పరత కలిగి ఉండాలి. ఈ మూడు లక్షణాలను జీవితంలో పరిపూర్ణంగా ఆచరించి చూపారు కనుక 'ఆచార్య దేవోభవ'గా కీర్తింపబడుతున్నారని స్వామి రంగనాథానంద విశ్లేషించారు.

డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్‌తో స్వామి రంగనాథానంద

'సర్వేపల్లి రాధాకృష్ణన్ శ్రీకృష్ణుడైతే, నేను ఆయన శిష్యుడినైన అర్జునుణ్ణి' అని మహాత్మా గాంధీ రాధాకృష్ణన్‌ను ఉద్దేశించి ఆప్యాయంగా అన్న మాటలివి.

పరిపూర్ణ ప్రేమతత్త్వం: సుమారు నలభై సంవత్సరాల పాటు అధ్యాపకవృత్తిలో కొనసాగి విద్యార్థులతో, విద్యా సంస్థలతో అనుబంధం కలిగి ఉన్నారు. గురువుగా, ఆత్మీయునిగా ప్రతి విద్యార్థి మదిలో స్థానం సంపాదించుకుని ఎందరో యువతీ యువకుల జీవితాలను ప్రభావితం చేశారు. వారిలో ఆధ్యాత్మిక, నైతిక విశ్వాసాలను పెంపొందించారు. క్లిష్టమైన అంశాలను విద్యార్థుల హృదయాల్లో హత్తుకునేటట్లు బోధించేవారు. విద్యార్థులతో స్నేహభావంతో కలిసిమెలిసి అభిమానంగా, ఆత్మీయంగా మెలుగుతూ "విద్యానిధిని పంచటానికి వచ్చిన సరస్వతీ పుత్రుడు"అని కీర్తింపబడ్డారు.

మతసామరస్యం – విశాలదృక్పథం : హిందూమతంలోని మూల సారాంశాన్ని అవగతం చేసుకుని 'సామాజిక న్యాయం, సమానత్వం, ప్రేమ, దయ, కరుణలను పంచుతూ మానవులకు మార్గనిర్దేశనం చేసేవే మతగ్రంథాలు అనీ, సర్వమత సారాంశం మంచిగా ఉండటం, మంచిని చెయ్యటం అనే స్వామి వివేకానంద బోధనలనూ ప్రజలకు బోధించారు'. రాధాకృష్ణన్ భారతీయ వివేకంతో ఆధ్యాత్మికంగా పండిన తత్త్వాన్ని గురించి చేసిన ప్రసంగాలు స్వాతంత్ర్య సమరయోధులకూ, పండితులకూ ప్రేరణ కలిగించాయి.

ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా 1962 చైనా యుద్ధం, 1965లో పాకిస్తాన్ యుద్ధ సమయాలలోనూ మరెన్నో ఇతర సమస్యలను పరిష్కరిస్తూ రాజ్యాంగ పరిధిలో రాధాకృష్ణన్ గావించిన సేవలు నిరుపమానమైనవి. భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత సోవియట్ యూనియన్‌లో భారతరాయబారిగా తన వాక్పటిమతో ఘర్షణకైతే ఇద్దరు ఉండాలనీ, దానిని నివారించడానికి ఒక్కరే చాలనీ చెబుతూ స్టాలిన్ మనస్సు మార్చి ఇరుదేశాల మధ్య బంధాన్ని పటిష్టపరిచాడు.

సామాన్య కుటుంబంలో పుట్టి, అధ్యాపకుడిగా, ఆచార్యునిగా, ఉపకుల పతిగా, భారత రాయబారిగా, ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా, తత్త్వవేత్తగా దేశానికి ఎనలేని సేవలందించి, దేశ విదేశాలలో భారతజాతి గౌరవాన్ని ఇనుమడింపజేసి, పూజ్యనీయుడిగా మన్ననలందుకుంటున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం. ❖

(సెప్టెంబర్ 5, శనివారం – ఉపాధ్యాయుల దినోత్సవం)

మా తల్లి గాజులకు నీరాజనం... నిత్య నీరాజనం...

- శ్రీమతి గరిమెళ్ళ లక్ష్మి

అది వేసవి కాలం. ఎండలో ఒక గాజుల వ్యాపారి ఒక పల్లె నుండి మరొక పల్లెకు గాజుల మూట భుజాన వేసుకుని తిరుగుతున్నాడు. అతను సర్వకాల సర్వావస్థలలోనూ 'దుర్గా' నామాన్ని ఉచ్చరిస్తుండడం వల్ల అతణ్ణి అందరూ 'దుర్గాదాసు' అనేవారు.

ఆ రోజు అప్పటికే రెండు గ్రామాలు దాటినా ఎవరూ గాజులు కొనుక్కోలేదు. అయినా 'దుర్గా..దుర్గా' అంటూ అమ్మ నామాన్ని స్మరిస్తూ ముందుకు సాగాడు. అంతా అడవి ప్రదేశం. ఎక్కడా మనుష్య సంచారం లేదు. ఒక చిన్న చెరువు దాటి ముందుకు వెళ్ళబోతుండగా 'ఓ గాజులబ్బాయీ' అన్న పిలుపు వినపడింది. ఈ అడవిలో ఎవరు పిలిచారా అని ఆశ్చర్యంగా వెనక్కి చూశాడు దుర్గాదాసు. చెరువు ఒడ్డున ఒక అయిదారేళ్ళ బాలిక నిలబడి, అతణ్ణి పిలుస్తోంది. ఆ బాలిక కంఠం ఎంతో మధురంగా ఉంది. అపురూప సౌందర్యం గల ఆ బాలిక "నాకు గాజులు వేస్తావా?" అని అడిగింది.

"రా తల్లీ! నా దగ్గర ఉన్న వాటిలోకెల్లా మంచి గాజులు నీ చేతికి వేస్తాను" అని ఆ బాలిక చేతుల నిండా గాజులు వేశాడు దుర్గాదాసు. గాజులు తొడుగుతున్నంత సేపూ అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవించాడు అతడు.

గాజులతో నిండిన తన రెండు చేతులను చూసి ఆనందిస్తూ, ఆ బాలిక "గాజులు చాలా బాగున్నాయి, అయితే నీకివ్వడానికి నా దగ్గర డబ్బులు లేవు" అని దుర్గాదాసుతో అంది. వెంటనే కొన్ని గుర్తులు చెప్పి ఆ ఇంటికి వెళ్ళి "మా నాన్నగారితో దేవుడి మందిరంలో ఒక భరిణెలో అర్ధరూపాయి ఉంది. దాన్ని మీ అమ్మాయి నాకు ఇమ్మంది అని అడిగి తీసుకో" అని ఆ బాలిక దుర్గాదాసుతో చెప్పింది.

దుర్గాదాసు ఆ అమ్మాయి చెప్పిన ప్రకారం ఆ ఇంటికి వెళ్ళి తలుపు తట్టాడు. ఇంటి యజమాని వచ్చి తలుపు తీశాడు. దుర్గాదాసు ఆ బాలిక చెప్పినట్లుగా 'దేవుడి మందిరంలో దుర్గాదేవి ప్రతిమ దగ్గర చిన్న భరిణెలో పైకం ఉంటుంది, అది నాకు ఇవ్వవలసిందని మీ అమ్మాయి చెప్పింది' అని అన్నాడు. ఇంటి యజమాని 'నాకు ఆడపిల్లలు లేరు. మా ఇంట్లో అలా డబ్బు ఎక్కడా పెట్టలేదు' అని చెప్పాడు. అయినా, సందేహంగానే దేవుడి గదిలోకి వెళ్ళి చూడగా నిజంగానే మందిరంలో దుర్గా ప్రతిమ పక్కన చిన్న భరిణె ఉంది. దానిని తెరిచి చూడగా అందులో అర్ధరూపాయి బిళ్ళ ఉంది. వెంటనే దాన్ని దుర్గాదాసుకు ఇచ్చి, భరిణె మూత పెట్టబోగా దానిలో మరొక అర్ధరూపాయి కనబడింది. దాన్ని తియ్యగానే, మరొకటి ఉంది. ఈ భరిణెలో ఇన్ని నాణాలు ఎలా అక్షయంగా వస్తున్నాయి అని అనుకున్నాడు. "ఆ అమ్మాయి కనబడిన చోటుకు నన్ను తీసుకుని వెళ్ళు" అని దుర్గాదాసుని అడిగాడు ఆయన.

ఇద్దరూ కలిసి ఊరి అవతల ఉన్న చెరువు దగ్గరకు వెళ్ళారు. అయితే అక్కడ ఎవరూ లేరు. 'ఎక్కడ కనపడింది ఆ బాలిక' అని అడిగాడు ఆయన. "నేను చూసినప్పుడు ఇక్కడే ఈ చెరువు ఒడ్డునే ఉంది" అన్నాడు దుర్గాదాసు.

ఇద్దరూ అలా వెతుకుతుండగా చెరువు మధ్యన దుర్గాదాసు గాజులు తొడిగిన రెండు చిన్ని చేతులు కనపడ్డాయి. కొన్ని క్షణాల తరువాత అవి క్రమంగా మాయమయ్యాయి. అది చూసిన వెంటనే దుర్గాదాసుకు తాను గాజులు వేసినది ఎవరికో అర్థమయింది.

"అమ్మని చూసి, మాట్లాడినా నేను ఆమె ఎవరో తెలుసుకోలేకపోయాను" అంటూ విలపించాడు దుర్గాదాసు. ❖

(దుర్గాదేవి బాలిక రూపంలో దర్శనమిచ్చి అంతర్ధానమైన చెరువు కలకత్తాకు 112 కి.మీ. దూరంలో ఉన్న కామార్పుకూర్‌లో ఉంది. అక్కడ నేటికీ అమ్మవారు భక్తుల పూజలందుకుంటోంది.)

ఆధారం : శ్రీరామకృష్ణ పరమహంస చెప్పిన కథ.

... 17వ పేజీ తరువాయి.

9 ఆకలితో అలమటిస్తున్న అనేకుల క్షుద్బాధను మణిమేఖల పోగొట్టింది. యువరాజు ఉదయకుమారుడు ఆమెను ఇంకా విడిచిపెట్టలేదు. మణిమేఖల కాయచండిక రూపాన్ని దాల్చింది. ఆ రూపంలోనే అనేక చెరసాలలకు వెళ్ళి, అక్కడున్న వారి ఆకలిని తీర్చి చెరసాలలను రాచవిడుదులుగా మార్చివేసింది.



10 అక్కడా మణిమేఖల వెంటపడిన యువరాజును కాయచండిక భర్త చంపాడు. తన కుమారుడి మరణానికి కారణమైన మణిమేఖలను రాణి బాధలకు గురిచేసింది. చివరకు తన తప్పును గ్రహించి క్షమించాల్సిందిగా ప్రార్థించింది.

11 సావక దేశ రాజు పుణ్యరాజన్ రాజ్యభోగాలలో మునిగి ఉన్నాడు. అతణ్ణి మార్చడానికి మణిమేఖల అక్కడకు వెళ్ళింది.



12 మణిపల్లవ ద్వీపంలో పుణ్యరాజన్ బౌద్ధ విహారాన్ని ఆరాధించగా గత జన్మ గురించి తెలిసింది.





పాఠశాల విద్యార్థిని ఎస్.వి. రాజేశ్వరి గీసిన చిత్రం

భగవంతుడికీ, భక్తుడికీ వ్యత్యాసం లేదనే దృఢ నిశ్చయంతో భక్తులను సేవించాలి. ప్రతి జీవీ సాక్షాత్తూ భగవత్ స్వరూపమని గ్రహించి చేయవలసింది జీవసేవ, జీవకారుణ్యమనేది మూర్ఖప్రలాపం!

– శ్రీరామకృష్ణ పరమహంస

గ్రంథ పరిచయం

శ్రీ సత్యనారాయణ వ్రతకల్పము



వ్యాఖ్యాత: ప్రొ॥ కుప్పా వేంకట కృష్ణమూర్తి
వెల: రూ. 50/-, పేజీలు : 258
ప్రాప్తి స్థానము : శ్రీపావని సేవాసమితి
శ్రీ సాయినిలయం, ఎస్.ఆర్.టి.270,
సనత్‌నగర్, హైదరాబాద్ - 500 018

అర్థంకాని, అర్థంలేని విద్య వ్యర్థమని ఆర్యోక్తి. కొన్ని పూజలు, వ్రతాలు, ఆచారం కాబట్టి చేస్తూ ఉంటారు. అంతేగాని భక్తి శ్రద్ధలు కలిగి, అంతరార్థం తెలిసికాదు. అలాంటి వాటిలో శ్రీసత్యనారాయణ స్వామివారి వ్రతం ఒకటి. గృహప్రవేశం, వివాహానంతరం ఈ వ్రతాన్ని చేస్తూ ఉంటారు.

భక్తికి, సంప్రదాయానికి మధ్య ఓ చక్కని వారధిని నిర్మించటానికి మహా పండితులు శ్రీ కుప్పా వేంకట కృష్ణమూర్తిగారు చక్కని ప్రయత్నం చేశారు. అర్థం తెలుసుకొని త్రికరణశుద్ధిగా శ్రీ స్వామిని అర్చించే విధానాన్ని తమ విపుల వ్యాఖ్యానం ద్వారా భక్తులకు ప్రబోధించారు. ఆచారం కన్నా శాస్త్రీయదృక్పథం కలిగిన మన వ్రతాలు, పూజల గురించి సమగ్రంగా అందించినందుకు శ్రీ కృష్ణమూర్తిగారికి, పావని సేవాసమితి వారికి అభినందనలు. ❖ - ఎం.వి. నాగప్రసాద్

ప్రామాణిక శ్రీ విష్ణు పురాణం

(పరాశర మహర్షి ప్రణీతము-ఆంధ్రానువాద సహితము)



వ్యాఖ్యాత - శ్రీ భాగవతుల సుబ్రహ్మణ్యం
వెల: రూ. 250/-, పేజీలు : 584,
ప్రతులకు : నవరత్న బుక్ హౌస్
28-22-20, రహిమాన్ వీధి
అరండల్ పేట, విజయవాడ - 520 002

దేవతలకు, మానవులకు, ఋషులకు ఆరాధనీయుడు, దశావతారాలలో దుష్ట శిక్షణ, శిష్టరక్షణ చేసిన శ్రీమన్నారాయణుని విరాట్ స్వరూపమే ఈ విష్ణు పురాణం.

ప్రధానంగా పరాశర మహర్షి ప్రణీతమైన శ్రీవిష్ణుపురాణాన్ని ఇంకా ఎన్నో పురాణాలను, గ్రంథాలను పరిశీలించి సామాన్యునికి కూడా అర్థమయ్యేటట్లు శ్రీభాగవతుల సుబ్రహ్మణ్యం గారు చక్కగా వ్యాఖ్యానించారు.

ఈ పుస్తకం ద్వారా సృష్టి, స్థితి, లయ కారకుల్లో స్థితికారకుడైన శ్రీమహావిష్ణువు ఉత్పత్తి తెలుస్తుంది. అష్టాదశ పురాణాల వివరాలు, ఇంకా సృష్టి పూర్వ స్థితితో మొదలై ఆరు అంశలతో భారత చరిత్ర, సూర్యమహిమ, వ్యాసచరిత్ర, సగర చరిత్ర, కృష్ణావతారం, కవి స్వరూపం మొదలైన అంశాలతో ఆద్యంతం ఆసక్తిదాయకమైన ఈ గ్రంథం అందరూ చదవదగినది. ❖ - రాళ్ళ భండి జయలక్ష్మి

శ్రీరామనామము- ఎంతో మంచి మధురము

(శ్రీరామ నామావళి) వెల:రూ.30/-

శ్రీకృష్ణా నీ పేరెంతో మధురమురా

(శ్రీకృష్ణ నామావళి) వెల:రూ.30/-

గానం : డా॥ పన్నాల శ్యామసుందరమూర్తి

నవయుగ ఆదర్శమూర్తులు



సంకలనం : డా॥ పన్నాల శ్యామసుందరమూర్తి
పేజీలు : 32, వెల : రూ.10/-

పుస్తకం, సి.డి.ల ప్రాప్తిస్థానం :
డా॥ పన్నాల శ్యామసుందరమూర్తి
శ్రీరామకృష్ణ సేవాసమితి
13-3-20, గుంటూరువారితోట
2వ లైను, గుంటూరు - 522 001
సెల్ నెం: 98661 75274

పండుగలు-పర్వదినాలు

సెప్టెంబర్ - 2009

13	ఆదివారం	:	స్వామి అభేదానంద జయంతి
15	మంగళవారం	:	ఏకాదశి
18	శుక్రవారం	:	స్వామి అఖండానంద జయంతి
28	సోమవారం	:	విజయదశమి -శాంతిజల్ (సాయంత్రం హారతి తర్వాత)
29	మంగళవారం	:	ఏకాదశి

అక్టోబర్ - 2009

03	శనివారం	:	లక్ష్మీ పూజ (సాయంత్రం హారతి తర్వాత)
14	బుధవారం	:	ఏకాదశి
17	శనివారం	:	దీపావళి - కాళీ పూజ
29	గురువారం	:	ఏకాదశి
30	శుక్రవారం	:	స్వామి సుబోధానంద జయంతి



'శ్రీరామకృష్ణ ధ్యాన మందిరం' ప్రారంభోత్సవం

ప్రకాశం జిల్లా, తిమ్మరాజుపాలెం శ్రీరామకృష్ణ సేవాసమితి నిర్మించిన శ్రీరామకృష్ణ పరమహంస ధ్యాన మందిరం 2009 ఆగష్టు 5న ఉదయం 9 గంటల 20 నిమిషాలకు హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షులు పూజ్య స్వామి జ్ఞానదానందజీ మహరాజ్ ప్రారంభోత్సవం చేశారు. శోభాయాత్ర, పూజ, హోమం, భజన కార్యక్రమాల్లో సుమారు 2000 మంది భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

ప్రారంభోత్సవ సభలో పూజ్య స్వామి జ్ఞానదానందజీ, స్వామి శశికాంతానందజీ, స్వామి అక్షరాత్మానందజీ, స్వామి రఘునాయకానందజీ, డా॥ పన్నాల శ్యామసుందర మూర్తి 'మూర్తిత్రయ జీవిత సందేశం–ఆధ్యాత్మిక జీవనావశ్యకత' అనే అంశంపై ప్రసంగించారు. మందిరంలో నిర్వహించే పూజా, సేవా కార్యక్రమాల్లో అందరూ పాల్గొని పవిత్ర ఆధ్యాత్మిక వాతావరణాన్ని సద్వినియోగపరచుకోవాల్సిందిగా స్వామీజీలు భక్తులకు సూచించారు.

'శ్రీరామకృష్ణుల మందిరం' నిర్మించాలన్న తమ చిరకాల వాంఛ నెరవేరినందుకు భక్తుల హృదయాలు ఆనందంతో వెల్లివిరిసాయి. గ్రామస్థులందరూ ఆద్యంతం ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని వారి సేవల్ని అందించారు.

సమితి అధ్యక్షులు శ్రీ డి.వి.బ్రహ్మాజీ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. ❖

నివేదిక :
వీరాంజనేయులు

భక్తులకు మంత్రోపదేశం

రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్‌ల ఉపాధ్యక్షులు **పూజ్య స్వామి స్మరణానందజీ మహరాజ్** 2009 సెప్టెంబరు 9 నుంచి సెప్టెంబరు 23వ తేదీ వరకు హైదరాబాద్ రామకృష్ణ మఠంలో బస చేస్తారు. ఆసక్తిగల భక్తులకు **సెప్టెంబరు 13,16,18,20**వ తేదీల్లో పూజ్య స్వామీజీ మంత్రదీక్ష ప్రసాదిస్తారు. పూర్తి వివరాల కోసం: **స్వామి జ్ఞానదానంద, అధ్యక్షులు, రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029**ను సంప్రతించవలెను.

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

1. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది కోర్సులకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) 'వేదచూడామణి' : ఋగ్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు : మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు : 8 నుంచి 10 సంవత్సరాల మధ్య
స్టైఫండ్ : నెలకు రూ. 1,000/-

(ఆ) 'వేదార్థచూడామణి' : ఋగ్వేదము/ యజుర్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు : సంస్కృత పరిజ్ఞానముతో బాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు : 15 సం॥, ఆ పైన
స్టైఫండ్ : నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) వేదాధ్యాపకుడు : (సామవేదము/ అథర్వవేదము - వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలిసిన అర్హతలు : క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు : ఏదైన మఱియొక వేదము/ వేదభాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము : 2 సంవత్సరములు
సంభావన : నెలకు రూ॥ 8,000/- మొత్తము, సౌకర్యములతో

(ఆ) వేదభాష్యాచార్యుడు : (ఒక్కొక్క వేదానికి ఒక్కొక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత : ఏదైనా వేద భాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత : మరొక వేద భాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత : 5 సం॥
సంభావన : నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన దరఖాస్తు ఫారములను **శ్రీ పి. వెంకటేశ్వర్లు గారు, మేనేజింగ్ డైరెక్టర్, కాకతీయ సిమెంట్, సుగర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్, 'గురుకృప' (ఆంధ్రా బ్యాంకు ఎదురుగా), 1 - 10 - 140/1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 500 020** (ఫోను: 040 - 27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టు ద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ఆ ముద్రిత దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్ని బట్టి ఖాళీలను పూరించుట లోనూ, అర్హతల సవరణ లోనూ మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

సం/-
హైదరాబాద్ కులప్రశాసకుడు

Sponsored by:

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1 - 10 - 140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad - 500 020
Ph: 2763 7717, 2763 3627, Fax No. 040-27630172, Email: info @ kakatiyacement.com

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**